# క్రైమ్ THE మిర్రర్ ®

Voice of Anti Corruption

హైదరాబాద్
13-3-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:15
సంచిక: 361

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


# యుద్ధ డిమాండ్లను అంగీకరించాల్సిందే

## అప్పుడే యుద్ధ విరమణకు అంగీకరిస్తాం

## ఇరాన్ విషయంలో దుందుడుకు చర్యలు అంగీకరించం

- ప్రపంచానికి తేల్చిచెప్పిన ఇరాన్ నాయకత్వం
- పరస్పరదాడులతో కొనసాగుతున్న ఉద్రిక్తతలు
- రెండు ట్యాంకర్లపై 'సూసైడ్ బోటు'తో దాడి
- మరిన్ని దాడులు చేస్తామంటూ ట్రంప్ హెచ్చరికలు





**టెహ్రాన్,(క్రైమ్ మిర్రర్):** ఇరాన్ వర్సెస్ ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య యుద్ధం 13వ రోజుకు చేరుకుంది. ఇజ్రాయెల్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఇరాన్‌పై మిస్సైల్స్, డ్రోన్లతో దాడులు చేస్తున్నాయి. ఈ దాడుల్లో ఇప్పటి వరకు 1300 మంది ఇరానీయులు చనిపోయినట్లు తెలుస్తోంది. ఇరాన్ కూడా ఏమాత్రం వెనక్కు తగ్గటం లేదు.

2లో



# కోకాపేటలో అల్లు సినిమాస్ మల్టీప్లెక్స్

- లాంఛనంగా ప్రారంభించిన సిఎం రేవంత్
- హాజరైన సినీ, రాజకీయ దిగ్గజనేతలు
- హైదరాబాద్‌లో నెట్‌ఫ్లిక్స్ స్టూడియో ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి
- ఫ్యూచర్‌సిటిలో ఏర్పాటుకు భూమి కేటాయిస్తామని ప్రకటన

**హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్):** నెట్‌ఫ్లిక్స్‌ను హైదరాబాద్‌కు ఆహ్వానిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ అన్ని అవకాశాలను కల్పిస్తుందని, తమ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. హైటెక్‌సిటీలోని నెట్‌ఫ్లిక్స్‌కు చెందిన ఐలైన్ స్టూడియోస్ కార్యాలయాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్యం నుంచే తనకు సినిమాలు అంటే ఇష్టం ఇష్టమన్నారు. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌కు వచ్చిందంటే హాలీవుడ్ నగరానికి వచ్చినట్లే అని సీఎం వ్యాఖ్యానించారు.

# 14నుంచి పదోతరగతి పరీక్షలు

- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- సకాలంలో సెంటర్లకు చేరుకోవాలని సూచన
- ఐదు నిముషాల ఆలస్యానికి అనుమతి

హైదరాబాద్: పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 14 నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు అధికారులు సకల ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలు శనివారం ప్రారంభమై..

2లో

# గ్యాస్ కొరతతో హోటళ్లు మూత

- హాస్టళ్ల పరిస్థితి మరింత దారుణం
- ఆర్టీసీ క్రాస్‌రోడ్ బావర్చి మూసివేత
- ప్యారడైజ్ హోటల్ కూడా అదే దుస్థితి
- బ్లాక్ విక్రయాలపై కఠిన చర్యలు తప్పవన్న అధికారులు



2లో




# దేశంలో గ్యాస్ సంక్షోభం

- కీలక సమావేశం నిర్వహించిన హోంశాఖ
- పరిస్థితులపై అధికారుల సమీక్ష.. గ్యాస్ కొరతపై విపక్షాల ఆందోళన
- పార్లమెంటు నుంచి బయటకు చేరిన నిరసనలు
- మకరద్వారం ముందు విపక్ష ఎంపిల నిరసన ప్రదర్శన

# ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణాకు ఐకాన్

## 1000 కోట్లతో అభివృద్ధికీ రూట్ మ్యాప్

- నిధులు మంజూరు చేయడం అభినందనీయం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి ఉత్తమ్ ప్రత్యేక ధన్యవాదాలు




**హైదరాబాద్,(క్రైమ్ మిర్రర్):** ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్రానికి ప్రత్యేక ఐకాన్ గా నిలిచిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అటువంటి విశ్వవిద్యాలయం మన రాష్ట్రంలో ఉండడం మనకెంతో గర్వకారణమని ఆయన చెప్పారు.ఇంతటి పేరెన్నికగన్న ఉస్మానియా విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని తాను కాంక్షిస్తున్నానని ఆయన చెప్పారు. గురువారం ఉదయం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విభాగంలో ఆయన నిర్మాణ్-26 సాంకేతిక సదస్సును ప్రారంభించారు. సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ

మిగతా 2లో

# నీటి వినియోగంలో జాగ్రత్తల ముఖ్యం

- భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలి
- రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చే యత్నం
- జగన్ హయాంలో పెట్టుబడిదారుల పరార్
- జిల్లాల వారీగా పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు
- సంపద సృష్టిస్తేనే మెరుగైన సమాజం సాధ్యం
- రెండోరోజు కలెక్టర్ల సదస్సులో సిఎం చంద్రబాబు




అమరావతి,మార్చి12(ఆర్ఎన్ఎ): నీటిని సక్రమంగా వినియోగించుకుంటేనే ప్రయోజనం ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.

మిగతా 2లో

# అభివృద్ధి పనులపై దృష్టి పెట్టండి

## గెలిచే వరకే రాజకీయాలు..తరవాత అభివృద్ధి

## ప్రజాప్రతినిధులకు మంత్రి పొంగులేటి హితవు

**ఖమ్మం,(క్రైమ్ మిర్రర్):** ప్రజాప్రతినిధులు అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఎన్నికల వరకే రాజకీయాలని.. ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రతి ఒక్కరూ ప్రజలకు మంచి చేసే ప్రజా ప్రతినిధులేనని పేర్కొన్నారు. మంచి కార్యక్రమాలను





# ఆనాడు ఒక్కడినే..ఈనాడు కోట్లాదమందికి అండ

- నల్లకాలువ సాక్షిగా ఇచ్చిన హామీ మేరకు పార్టీ స్థాపన
- కోట్లాది మంది ప్రజల గుండెల్లో నిండుగా ఉంది
- పార్టీ ఆవిర్భావ వేడుకల్లో వైఎస్ జగన్

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** పార్టీ స్థాపన సమయంలో తాను ఒక్కడినే ఉన్నానని, కానీ ఇప్పుడు కోట్లాది మంది ప్రజల ఆశీర్వాదంతో వైసీపీ ఒక పెద్ద శక్తిగా ఎదిగిందని వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్ చెప్పారు.

# బిఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు క్లోజ్

- స్పీకర్ నిర్ణయంతో ఏకీభవించిన సుప్రీం
- తదుపరి విచారణ అవసరం లేదని వ్యాఖ్య



**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసు విచారణ ఎట్టకేలకు ముగిసింది. రాష్ట్ర రాజకీయాల్లో కొన్నిరోజులుగా




# ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణకు ఐకాన్

(మొదటి పేజీ తరువాయి)

1917 లో స్థాపించిన ఈ విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిందన్నారు.అందుకు కొనసాగింపుగా 1929 లో విశ్వవిద్యాలయం సౌజన్యంతో ప్రారంభం అయిన ఇంజినీరింగ్ కళాశాల యావత్ భారతదేశంలోనే అత్యంత ప్రాశస్త్యమైన కళాశాలలలో ఆరవ స్థానంలో నిలిచిందని ఆయన చెప్పారు. అంతటి ప్రఖ్యాతి గాంచిన విశ్వవిద్యాలయం అభివృద్ధికి ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించడమే కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏకంగా 1,000 కోట్లు నిధులు మంజూరు చేయడం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం చరిత్రలోనే ఇంత పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడం చారిత్రాత్మక ఘట్టంగా ఆయన అభివర్ణించారు.అంతర్జాతీయ స్థాయిలో ఈ విశ్వవిద్యాలయాన్ని తీర్చిదిద్దాలి అన్నదే ప్రభుత్వ సంకల్పం అని అందుకనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించినట్లు ఆయన వెల్లడించారు. విశ్వవిద్యాలయంలో అవసరమైన అధ్యాపకుల భర్తీ విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డితో చర్చించి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఇక్కడి నుండి ఎంతో మేధో సంపద ఉత్పత్తి అయిందని ఆ మేధస్సు ప్రపంచ స్థాయిలో అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. సిలికాన్ వ్యాలీలో పనిచేస్తున్న మెజారిటీ ఇంజినీర్లు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండే ఎదిగిన వారు అని,అంతే గాకుండా గల్లీ నుండి డిల్లో స్థాయికి ఎదిగిన నేతలు,క్రీడాకారులు,ఉన్నత పదవులు చేపట్టిన వారి అడుగులు ఇక్కడి నుండే మొదలు అయ్యాయని ఆయన చెప్పారు. అటువంటి విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్ర ఉద్యమంలో అగ్రభాగాన నిలుచోవడమే కాకుండా విద్యార్థులు చేసిన త్యాగాలు ఇక్కడ ప్రస్తావనర్హమే అని భావిస్తున్నానని ఆయన చెప్పారు. ఇక్కడ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు,సాంస్కృతిక కార్యక్రమాలలో కుడా భాగస్వామ్యం కావాలని ఆయన ఉద్బోధించారు. ఇంజినీరింగ్ విభాగం గురుంచి ఆయన ప్రస్తావిస్తూ తెలంగాణా రాష్ట్ర అభివృద్ధిలో ఇంజినీరింగ్ విభాగం ముఖ్య భూమిక పోషిస్తుందని ఆయన చెప్పారు. నిజాంసాగర్, నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి భారీ ప్రాజెక్టులతో పాటు ఎస్.ఎల్.బి.సి, దేవాదుల వంటి ఆధునిక ప్రాజెక్టులు ఇంజినీరింగ్ ప్రతిభకు అద్దం పడుతున్నాయన్నారు. సివిల్ ఇంజినీరింగ్ విభాగము విద్యార్థులకు ప్రాక్టికల్స్ పాఠాలుగా ఉపయోగ పడుతాయని ఆయన చెప్పారు. భవిష్యత్లో స్థిరమైన అభివృద్ధి,ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, జలవనరుల సమగ్ర నిర్వహణ తో పాటు చెక్ డ్యామ్ ల పునరుద్ధరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంజినీర్లు ప్రాజెక్టుల నిర్మాణాలకు మాత్రమే పరిమితం కాకుండా వాటి భద్రత,నిర్వహణ బాద్యతలు కుడా ఇంజినీర్లకు ఉంటాయన్నారు. నిర్మాణ్-26 వంటి సాంకేతిక సదస్సులు విద్యార్థులకు పరిశోధన,సృజనాత్మక తాను పెంపొందించే వేదికలని ఆయన చెప్పారు. మన నిర్మాణాలు కేవలము కట్టడాలకే పరిమితము కాకుండా ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకు దోహద పడాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉద్బోధించారు.

## 14నుంచి పదోతరగతి పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

ఏప్రిల్ 16వ తేదీ వరకు జరుగుతాయి. ఉదయం 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభం అవుతాయి. సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. అయితే పరీక్షలకు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అనుమతిస్తారు. ఆ తర్వాత వచ్చే వారిని అస్సలు అనుమతించబోరు. అంటే ఉదయం 9:35 గంటల తర్వాత వచ్చే విద్యార్థులను పరీక్షకు అనుమతించబోరు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,676 సెంటర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ బడుల్లో 1,582 సెంటర్లు, ప్రైవేట్ బడుల్లో 1,094 సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ సారి 5,17,727 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. పరీక్షల సందర్భంగా సెల్‌ఫోన్ల వినియోగంపై అధికారులు కఠిన ఆంక్షలు విధించారు. పరీక్ష కేంద్రాలను 'నో సెల్‌ఫోన్' జోన్లుగా ప్రకటించారు. పరీక్ష సిబ్బంది, స్కాడ్ సహా ఇతర అధికారులందరికీ ఈ నిబంధనలు వర్తిస్తాయి. తనిఖీలకు వచ్చే అధికారులు సైతం సెల్‌ఫోన్లు తీసుకెళ్లరాదు. వీరు తమ సెల్‌ఫోన్లను గది బయటే పెట్టాల్సి ఉంటుంది. ఎవరొచ్చినా తనిఖీలు చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తారు. ఒకవేళ ఎవరైనా ఈ నిబంధనలు ఉల్లంఘించి సెల్‌ఫోన్లతో విధులకు హాజరైతే వారిని సస్పెండ్‌చేస్తారు. పేపర్ లీకేజీలకు పాల్పడితే ఉద్యోగం నుంచి తొలగిస్తారు. పరీక్షలు జరుగుతుండగానే మూల్యాంకనం కూడా ప్రారంభం అవుతంది. ఈ నెల 14 నుంచి పదో తరగతి పరీక్షలు జరుగనుండగా, ఏప్రిల్ 1 నుంచి జవాబపత్రాల మూల్యాంకనం జరుగనున్నది.

## దేశంలో గ్యాస్ సంక్షోభం

(మొదటి పేజీ తరువాయి)

**న్యూఢిల్లీ, (క్రైమ్ మిర్రర్):** పశ్చిమాసియా సంక్షోభ నేపథ్యంలో దేశంలో వంటగ్యాసు (ఎల్‌పీజీ) ఏజెన్సీల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. ముఖ్యంగా వాణిజ్య సిలిండర్లను నల్లబజారులో కొనాల్సిన పరిస్థితి తలెత్తింది. నల్లబజారులో గ్యాస్ విక్రయాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టినట్టు కేంద్రం ప్రకటించింది. ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్ వ్యవధిని 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచింది. వాణిజ్య సిలిండర్ల సరఫరాను సమీక్షించేందుకు చమురు మంత్రిత్వశాఖ ఓ కమిటీని ఏర్పాటుచేసింది. బుక్ చేసిన రెండున్నర రోజుల వ్యవధిలో గృహ వినియోగదారులకు సిలిండర్ అందజేసే విధానాన్ని కొనసాగిస్తున్నా మని తెలిపింది. వంటగ్యాసు సమస్యపై కేంద్ర ప్రభుత్వం హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ అధ్యక్షతన కీలక సమావేశం నిర్వహించింది. గృహ వినియోగదారులకే అత్యధిక ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలంది. ముంబయి, దిల్లీ, బెంగళూరు సహా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు 'తాత్కాలికంగా' మూతబడటం ప్రారంభమైంది. దేశంలో చమురు, ఎల్పీజీ నిల్వలు సరిపడా ఉన్నాయని కేంద్రం చెబుతున్నప్పటికీ.. పలు ప్రాంతాల్లో కొరత ఆందోళన కలిగిస్తోంది. హోటళ్లు ప్రత్యామ్నాయ ఇంధనంపై దృష్టి సారిస్తున్నాయి. ఆలయాలు, మఠాలపై సైతం వంటగ్యాసు కొరత ప్రభావం కనిపిస్తోంది. అయోధ్యలోని ప్రసిద్ధ అమావా ఆలయంలో 'రామ్ రసోయీ' అన్నదాన కేంద్రాన్ని తాత్కాలికంగా మూసివేశారు. మైక్రోవేవ్ అవెన్‌లు, ఇండక్షన్ ప్లేట్ల వాడకం ప్రారంభించాలని ఐఆర్‌సీటీసీ పశ్చిమ జోన్‌లోని కేటరింగ్ యూనిట్లను ఆదేశించింది. 'మోదీజి -ఎల్‌పిజి' అంటూ ప్రతిపక్షాలు గురువారం పార్లమెంటు ఎదుట ఆందోళన చేపట్టారు. కమరిషయల్ ఎల్‌పిజి సిలిండర్ల కొరతపై మోడీ ప్రభుత్వం సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, డిఎంకె, టిఎంసి, ఎసి సహా పలువురు ఎంపిలు మకరద్వారం ఎదుట ఆందోళన చేపట్టారు. 'నామ్ నరేందర్, కామ్ సరెండర్', 'మోడీజి, ఎల్‌పిజి' అంటూ నినాదాలు చేశారు. ప్రియాంక వాద్రా గాంధీ సహా పలువురు మహిళా ఎంపిలు ఇటుకల పొయ్యిలను ప్రదర్శించారు. ప్రధాని మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. పశ్చిమాసియా పరిస్థితులు, భారత్‌పై దాని ప్రభావంపై పూర్తి స్థాయిలో చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రధాని మోడీపై విరుచుకుపడ్డారు.

## ఆనాడు ఒక్కడినే..ఈనాడు కోట్లాదమందికి అండ

నల్లకాల్వలో ఇచ్చిన మాటే పార్టీ ఆవిర్భావానికి ప్రధాన కారణమైంది. ఆ ఒక్క మాట రాష్ట్ర రాజకీయాల దశ, దిశను మార్చిందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. 2011 మార్చి 12న స్థాపించబడిన వైసీపీ.. ఇప్పుడు 16వ వసంతంలోకి అడుగుపెట్టింది. ఈ సందర్భంగా పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జగన్ కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. దివంగత నేత వైయస్ రాజశేఖర రెడ్డి మరణం తర్వాత ఆయన ఆశయాలను కొనసాగిస్తానని, ఆయన మరణాన్ని తట్టుకోలేక చనిపోయిన కుటుంబాలను పరామర్శిస్తానని జగన్ నల్లకాల్వలో ఇచ్చిన మాట ఆ పార్టీ స్థాపనకు పునాది వేసింది. ఓదార్పు యాత్రకు కాంగ్రెస్ పార్టీ అడ్డు చెప్పడంతో.. ఇచ్చిన మాట కోసం ఆ పార్టీని వదిలి, వైయస్సార్సీపీని జగన్ స్థాపించారు. 'అప్పట్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోనూ, కేంద్రంలో నూ అధికారంలో ఉన్నప్పటికీ ఎలాంటి భయం లేకుండా ప్రజల కోసం పోరాటం చేశా. మొదటి నుంచీ ప్రజలు, దేవుడ్నే నమ్ముకుని ముందుకు సాగా. వైసీపీ ఆవిర్భావం తర్వాత దేశ రాజకీయాల్లో కూడా మార్పులు కనిపించాయి. వైసీపీ కార్యకర్తలు ఎప్పుడూ గర్వంగా కాలర్ ఎగరేసేలా పార్టీ నిలుస్తుంది. ఈ పార్టీ కొన్ని కోట్ల మంది ప్రజలదని అన్నారు. అందరి ఆశలు, ఆకాంక్షలకు ప్రతీకగా పార్టీ నిలిచింది. పార్టీ లోపల ఎప్పుడూ విలువలు, విశ్వసనీయతకు పెద్దపీట వేస్తాం. నాపై ప్రేమాభిమానాలు చూపుతున్న కార్యకర్తలు, అభిమానులకు హృదయపూర్వక కృతజ్ఞతలు. వైసీపీని అభిమానించే ప్రతి ఒక్కరికీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు' అని వైఎస్ జగన్ తెలిపారు.

## గ్యాస్ కొరతతో హోటళ్లు మూత

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** వంటగ్యాస్ కొరత హోటల్ పరిశ్రమను అతలాకుతలం చేస్తోంది. ఇక్కడ హాస్టళ్లో ఉంటూ చదువుకుంటున్న వారు తీవ్ర ఇబ్బందులకు గురయ్యే దుర్భర పరిస్థితి నెలకొంది. అలాగే హోటల పరిశ్రమపై ఆధారపడ్డ నిరుద్యోగులు కూడా ఆందోళన చెందుతున్నారు. మహానగరంలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా నిలిచిపోయింది. వంటగ్యాస్ సిలిండర్ల సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె. శ్రీనివాస్ తెలిపారు. సిలిండర్లను అధిక ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయిల్ కంపెనీలకు ఆదేశాలు జారీ చేశామని, ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. నెలకు ఒక సిలిండర్ బుకింగ్ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పశ్చిమాసియా యుద్ధం పీజీ యజమానుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది.

# యుద్ధ డిమాండ్లను అంగీకరించాల్సిందే

రెండు దేశాలపై విరుచుకుపడుతోంది. అరబ్ దేశాలలోని అమెరికా ఎయిర్‌బేస్‌లపై దాడులు చేస్తోంది. యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయిల్, గ్యాస్ ఎరువుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక ప్రకటన చేశారు. యుద్ధానికి ముగింపు పలకాలంటే తమ షరతులకు అంగీకరించాల్సిందేనని తేల్చి చెప్పారు. భవిష్యత్‌లోనూ తమ దేశంపై ఎవరూ దాడులు చేయకూడదని అన్నారు. తమ న్యాయపర హక్కులను ప్రపంచం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. పశ్చిమాసియాలో శాంతి, భద్రతలకు ఇరాన్ కట్టుబడి ఉందన్నారు. అయితే, ఇరాన్ భద్రతకు గ్యారెంటీ ఇస్తేనే యుద్ధం ఆపుతామని చెప్పారు. రష్యా అధ్యక్షుడు పుతిన్, పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్‌తో ఫోన్‌లో మాట్లాడినపుడు కూడా ఇదే విషయం చెప్పామని అన్నారు. ఈ క్రమంలో పశ్చిమాసియా లో ఉద్రిక్తతలు నానాటికీ పెరుగుతున్నాయి. ముఖ్యంగా అమెరికా, దాని మిత్ర దేశాల నౌకలపై ఇరాన్ దాడులు తీవ్రమవుతున్నాయి. తాజాగా ఇరాక్ ప్రాదేశిక జలాల్లో రెండు ట్యాంకర్లపై 'సూసైడ్ బోటు'తో దాడి జరిగింది. ఈ ఘటనలో ఓ భారతీయుడు మృతిచెందడం గమనార్హం. పర్షియన్ గల్ఫ్‌లో ఇరాక్ తీరం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దాడికి గురైన నౌకలను అమెరికాకు చెందిన సేఫ్‌సీ విష్ణు, గ్రీస్‌కు చెందిన జెఫిరోస్‌గా గుర్తించారు. సేఫ్‌సీ విష్ణు నౌక మార్షల్ ఐలాండ్స్ జెండాతో ఉండగా.. జెఫిరోస్‌పై మాల్టా జెండా ఉంది. ఈ నౌకలు తీరంలో చమురు సేకరిస్తుండగా పేలుడు పదార్థాలతో ఉన్న 'సూసైడ్ బోటు' వీటిని ఢీకొట్టినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో భారీగా పేలుడు సంభవించి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో రెండు నౌకల్లో ఉన్న 38 మంది సిబ్బందిని రెస్క్యూ టీం సభ్యులు కాపాడారు. ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. మృతుడిని భారతీయుడిగా గుర్తించారు. అయితే, అతడి పూర్తి వివరాలు మాత్రం తెలియరాలేదు. ఈ దాడి తమ పనేనని ఇరాన్ (ఎసజీని) ప్రకటించింది. ఈ మేరకు తమ అధికారిక మీడియాలో వెల్లడించింది. ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధి మార్గంలో ప్రయాణించే చమురు నౌకలపై దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే. బుధవారం కూడా మూడు కమర్షియల్ నౌకలపై డ్రోన్ దాడులు జరిగాయి. వీటిల్లో ఓ నౌక థాయ్ జెండాతో భారత్‌కు వస్తుండగా.. యూఏఈ తీరంలో దాడి జరిగింది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబాకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం.. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ అమెరికా డిమాండ్లకు ఒప్పుకోవా లని ట్రంప్ స్పష్టం చేశారు. న్యూక్లియర్ వెపన్స్ ప్రోగ్రామ్‌ను ఇరాన్ పూర్తిగా ఆపేయాలన్నారు.

## కోకాపేటలో అల్లు సినిమాస్ మల్టీప్లెక్స్



నెట్‌ఫ్లిక్స్‌తో తన కల నిజం కాబోతోందని వ్యాఖ్యానించారు. నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ విస్తరణకు తమ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఫోర్త్‌సిటీని నిర్మిస్తున్నామని.. నెట్‌ఫ్లిక్స్ విస్తరణకు కావాల్సిన భూమిని ఫ్యూచర్ సిటీలో ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ ఆఫీస్‌ను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమానికి పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి డి. శ్రీధర్‌బాబు, సినీనటుడు రానా దగ్గుబాటి, నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ సీఈఓ జెఫ్ షాపిరో, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. తనకు సినిమాలపైన ఆసక్తి ఉందని.. తన బాల్యం నుంచి ఇప్పటి వరకు చిత్రరంగంలో అనేక మార్పులు వచ్చాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బాహుబలి, కల్కి, ఆర్‌ఆర్‌ఆర్, అరుంధతి వంటి అత్యున్నత సాంకేతికతతో కూడిన సినిమాలు వచ్చాయని చెప్పుకొచ్చారు. చెన్నైలో ఉన్న తెలుగు సినిమా రంగాన్ని నందమూరి తారక రామారావు , అక్కినేని నాగేశ్వరరావు హైదరాబాద్‌కు తీసుకువచ్చారని గుర్తుచేశారు. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్ వచ్చిందంటే హాలీవుడ్ వచ్చినట్లేనని పేర్కొన్నారు. తమ దృష్టి హాలీవుడ్‌పైనేనని తాను గతంలోనే చెప్పానని ప్రస్తావించారు. ప్రపంచంలోని 500 పెద్ద కంపెనీలను తెలంగాణకు తీసుకురావడానికి తాము ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. తెలంగాణలో మీ పెట్టుబడికి పూర్తి రక్షణ ఉంటుందని.. తమ రాష్ట్రం అంటేనే వ్యాపారమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు హైదరాబాద్ కోకాపేటలోని 'అల్లు సినిమాస్' మల్టీప్లెక్స్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ముఖ్యమంత్రికి నటుడు అల్లు అర్జున్ స్వాగతం పలికారు. మల్టీప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన అల్లు రామలింగయ్య విగ్రహానికి సీఎం రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నివాళులర్పించారు. 'అల్లు సినిమాస్'లోని ఏర్పాట్లను అల్లు అరవింద్, అల్లు అర్జున్ వివరించారు. అనంతరం డాల్బీ స్క్రీన్‌లో ప్రదర్శించిన పలు ప్రచార చిత్రాలను వీక్షించారు.

## నీటి వినియోగంలో జాగ్రత్తల ముఖ్యం

భవిష్యత్ తరాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సచివాలయంలో సీఎం అధ్యక్షతన రెండో రోజు కలెక్టర్ల సదస్సు ప్రారంభమైంది. పెట్టుబడులు, వైద్యం, సూపర్ సిక్స్- సంక్షేమం, ఆదాయార్జన శాఖలు, విద్య- నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై చర్చిస్తున్నారు. జిల్లాల వారీగా పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలను సీఎం అధికారులకు వివరించారు. రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. సంపద సృష్టించేందుకు ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకోవాలి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఎలా ఉన్నామో జిల్లాల వారీగా వివరాలు ఉండాలి. గత వైకాపా హయాంలో పెట్టుబడులకు ఎవరూ ముందుకు రాలేదు. ఉన్న కంపెనీలు కూడా పారిపోయిన పరిస్థితి అందరం చూశాం. వనరులు ఉన్నా సరైన రీతిలో ఉపయోగించుకోవాలి. లేదంటే వ్యర్థమేనని చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశర చేశారు. సంపద సృష్టితో పాటు ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రకటించారు. కుటుంబ సాధికారిత సాధించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## అభివృద్ధి పనులపై దృష్టి పెట్టండి

ప్రోత్సహించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. గురువారం ఖమ్మం భక్త రామదాసు కళాక్షేత్రంలో ప్రజా ప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక శిక్షణా కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు.తమ ప్రభుత్వం 6 తేదీ నుంచి 99 రోజుల పాటు ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక రూపొందించిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సర్పంచ్‌గా ఆ వ్యక్తి ఉంటే గ్రామం అభివృద్ధి జరిగిందని చెప్పుకునేలా పని చేయాలని దిశానిర్దేశర చేశారు. అధికారులు కలెక్టర్, పోలీస్ కమిషనర్‌లు వారు ఉన్నప్పుడు మంచి పనులు జరిగాయని ప్రజలు చెప్పుకోవాలన్నారు. ఓట్లు వేసిన ప్రజలకు మంచి చేయాల్సిన బాధ్యత, ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేసే బాధ్యత మనపై ఉందని చెప్పుకొచ్చారు. గ్రామ పంచాయతీ వ్యవస్థ వచ్చిన తర్వాత ఇంత పెద్ద మొత్తంలో నిధులు వచ్చిన దాఖలాలు లేవని తెలిపారు. మార్చి 31వ తేదీ లోపు అభివృద్ధి పనుల కోసం నిధులు మళ్లీ వస్తాయని.. వచ్చిన నిధులను ప్రణాళికబద్ధంగా, ప్రజలకు ఉపయోగపడేలాగా వినియోగించాలని మార్గనిర్దేశర చేశారు. సర్పంచ్‌లకు మునుపే ట్రైనింగ్ ఇచ్చారని, వారి విధులు ఏంటి, మీరు ఎలా పని చేయాలనే విషయాలు ఇప్పటికే అర్థమై ఉంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వేసవిలో తాగునీరు సమస్య లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు పని చేయాలని ఆదేశించారు. ఏ గ్రామ పంచాయతీకి అత్యధిక నిధులు వచ్చాయో ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ప్రజాప్రతినిధులు గ్రామాల అభివృద్ధిలో భాగస్వామ్యం అవ్వాలని సూచించారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య భాగస్వామ్యం అయ్యేలా పని చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దిశానిర్దేశర చేశారు.

## బిఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు క్లోజ్

తీవ్ర కలకలం రేపిన ఈ కేసు విచారణను గురువారం నాడు సుప్రీంకోర్టు ముగించింది. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలని చెప్పినా.. స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేటీఆర్, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ గురువారం విచారణకు రాగా విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై సుదీర్ఘ విచారణ అనంతరం ఉన్నత న్యాయస్థానం తుది తీర్పు వెలువరించింది . ఈ కేసును జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించగా.. స్పీకర్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ ఇప్పటికే విచారణ జరిపి, తగిన నిర్ణయం తీసుకున్నారని ఆయన కోర్టుకు వివరించారు. దీంతో ఈ సమస్య సభాపతి కార్యాలయంలోనే ముగిసిందన్నారు. సింఘ్వీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. ఈ వ్యవహారంపై స్పీకర్ ఇప్పటికే తుది నిర్ణయం తీసుకున్నందున విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని భావించింది.

క్రైమ్ మిర్రర్ ®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 13-3-2026


# పెళ్లిని వ్యాపారంగా మార్చిన యువతా మేలుకోండి

**అంటున్న ఇందుర్తి కోటిరెడ్డి**

**మీరేమనుకున్నా పెద్దవాడిగా నా సందేశం ఇదే**



**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 12:** పెళ్లిని వ్యాపారంగా మార్చిన యువతా మేలుకోండి.లేదంటే ఒంటరితనమే మీకు మీరు వేసుకునే శిక్ష అవుతుంది.ఈ రోజుల్లో మూడు పదుల వయసు దాటిన యువతి యువకులకు పెళ్లి ఎందుకు కావడం లేదు ?ఎందుకు మూడు పదుల వయసు దాటినా ఏ ఒక్క సంబంధం కుదరడం లేదు ?దానికి కారణం దేవుడు కాదు. జాతకం కాదు. సమాజం కాదు.మీ అత్యాశ,మీ అహంకారం.మీ వ్యాపార దృష్టి. మొదట అబ్బాయిల సంగతి చూద్దాం రండి. అబ్బాయిల కోరికల చిట్టా కాదు కాదు పెళ్ళి అనే వ్యాపారంలో కోరుకునే లాభాల చిట్టా.. అమ్మాయి అందంగా ఉండాలి ఉద్యోగం చేయాలి,పెద్ద పెద్ద చదువులు చదివి ఉండాలి, లక్షలకు లక్షలు కట్నం తీసుకురావాలి,బంగారం, ఆస్తి కూడా ఉండాలి.అంటే ఏమిటి?అసలు మీకు భార్య కావాలా?లేదా అందం ం జీతం ం కట్నం ం ఆస్తి అనే ప్యాకేజీ కావాలా?మీకు మీ జీవితాన్ని నడిపే శక్తి లేదా? మీ అసమర్థతను,చేతగానితనాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఒక అమ్మాయి డబ్బు కావాలా?"ఇప్పుడు అమ్మాయిల సంగతి కూడా చెప్పాలి". ఈరోజుల్లో అమ్మాయిలు ఏం తక్కువ కాదు రెండు ఆకులు ఎక్కువనే చదివారు.అబ్బాయిల కంటే అబ్బాయి అందంగా ఉండాలి.నెలకు లక్ష రూపాయలు సంపాదించాలి, అత్తమామల దగ్గర ఉండకూడదు,పెళ్లైన వెంటనే వేరు కాపురం పెట్టాలి పెద్ద పెద్ద ఆస్తులు ఉండాలి.అంటే ఏమిటి? మీకు భర్త కావాలా?లేదా రెడి మేడ్ లైఫ్ ప్యాకేజ్ కావాలా?ఇద్దరూ కలిసి పెళ్లిని బజార్లో అమ్మే సరుకులా మార్చేశారు."ఇది సరిపోలేదు""అది ఇంకా బెటర్ వస్తుంది" "ఇంకొంచెం ఆగితే మంచి మ్యాచ్ దొరుకుతుంది"అంటూ వయసు పెరిగిపోతుంది.సంబంధాలు తగ్గిపోతాయి.చివరికి మిగిలేది ఒంటరితనం.మూడు పదులు దాటాక అకస్మాత్తుగా బుద్ధి వస్తుంది: "అయ్యో... నేను చాలా ఎక్కువగా ఆశించానేమో" "అయ్యో... మంచి సంబంధాలు వదులుకున్నానేమో"అప్పటికే ఆలస్యం.అప్పుడు చేసుకోవాలన్నా మీకు ముందుకు వచ్చే వాళ్లు ఉండరు.మీరు మీ షరతులు తగ్గించుకున్నా అప్పుడు మిమ్మల్ని నమ్మే వాళ్లు , మిమ్మల్ని చేసుకునేవాళ్ళు ఎవరు ఉండరు."ఎందుకు ఇంత లేట్?" అనే ప్రశ్న మిగులుతుంది.ఇదే జీవిత సత్యం.పెళ్లి అనేది జీతాల పోటీ కాదు.అందాల ప్రదర్శన కాదు.ఆస్తుల లెక్క కాదు పెళ్లి అనేది ఇద్దరూ కలిసి ఎదగడానికి, ఒకరిని ఒకరు అర్థం చేసుకోవడానికి జీవితాన్ని పంచుకోవడానికి...ఓ యువతా ఈరోజు మీకు ఉన్న ఎంపికలు రేపు ఉండవు. అత్యాశను ప్రేమ అనుకుంటే చివరికి మిగిలేది పశ్చాత్తాపమే.ఇప్పటికైనా గుర్తు పెట్టుకోండి: పర్ఫెక్ట్ మనిషి ఉండడు పర్ఫెక్ట్ ప్యాకేజ్ అనేది మాయ మంచి మనసు,అర్థం చేసుకునే గుణమే నిజమైన సంపద లేకపోతే మీరు పెళ్లిని వ్యాపారంగా చేసినందుకు జీవితం మిమ్మల్ని ఒంటరిగా నిలబెడుతుంది.గుర్తుపెట్టుకోండి మన అమ్మానాన్న ఎలా ఉన్నా మనకు నచ్చుతారు,మన తోబుట్టువులు ఎంత అంద వికారంగా ఉన్నా మనకి ఇబ్బంది అనిపించదు.కానీ జీవిత భాగస్వామిని ఎంచుకునేటప్పుడు మాత్రం ఇంత అందంగా ఉండాలి,అంత లావుఉండాలి,ఇంత పొడుగు ఉండాలి,ఇంతే వయసు ఉండాలి . ఇలా వంద క్వాలిఫికేషన్స్ చూస్తాం. ఇది చాలా తప్పండి.అమ్మా నాన్నలు మనకెందుకు అందంగా కనిపిస్తారంటే అమ్మా నాన్నల మనసుని ప్రేమిస్తాం.కానీ జీవిత భాగస్వాముల శరీరాన్ని ప్రేమిస్తాం. అందుకే అందం అందం అని ఎగబడుతున్నాం. అందం శాశ్వతం కాదని గుర్తుపెట్టుకోండి.మంచి మనసున్న వారు ఏకంకండి. అందం అందం అని పాకులాడితే, ఆస్తి ఆస్తి అనే ఎగబడితే,కట్నం కట్నం అని కోరికలు పెంచుకుంటూ పోతే శాలరీలనీ, ప్యాకేజీలని అత్యాశలకు పోతే చివరికి మీ ముఖం చూసే మనిషికూడా ఉండడు.మీ జీవితంలోకి వచ్చే జీవిత భాగస్వామి ఉండదు.ఇది వార్నింగ్ అనుకోండి,సలహా అనుకోండి.

# మెడికవర్ ఆసుపత్రి ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి







గండిపేట(క్రైం మిర్రర్): ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో నూతనంగా నిర్మించిన మెడికవర్ ఆసుపత్రిని గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్‌యాదవ్, ముఖ్యమంత్రి ప్రధాన సలహాదారులు వేం నరేందం ్రెడ్డిలు హజరైయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ దేశంలో ప్రముఖ హెల్త్‌కేర్ హబ్‌గా అభివృద్ధి చెందుతుందన్నారు. అత్యాధునిక వైద్య సాంకేతికతతో కూడిన ఆసుపత్రుల స్థాపన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. మంత్రి దామోదర్‌రాజనర్సింహ్మా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందన్నారు. ఇటువంటి ఆధునిక వైద్య సదుపాయాలు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడంలో ఎంతో సహాయపడతా యన్నారు. మెడికవర్ ఆసుపత్రుల ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ జి.అనిల్‌కృష్ణ మాట్లాడతూ హైదరాబాద్ ప్రజలకు ప్రపంచ స్థాయి వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ ఆసుపత్రిని ప్రారంభించామన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎ.శరత్‌రెడ్డి మాట్లాడుతూ 640--స్లైస్ సిటి స్కాన్, వేగవంతమైన హార్ట్ స్కానింగ్ వంటి ఆధునిక సాంకేతికతలతో ఖచ్చితమైన నిర్ధారణ చేసి రోగులకు సమయానికి చికిత్స అందించగలనున్నామన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.హరికృష్ణ మాట్లాడుతూ హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరంగా మారుతున్న నేపథ్యంలో ప్రపంచ స్థాయి వైద్య సేవల అవసరం పెరుగుతుందని, ఆ అవసరాన్ని దృష్టిలో ఉంచుకోని ఈ ఆసుపత్రిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డైరెక్టర్ ఏ.ఆర్.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు, ఆధునికన వైద్య పరికరాలు, సమగ్రవైద్య విధానాలతో ఈ ఆసుపత్రి రోగులకు వేగవంతమైన , సమర్థవంతమైన చికిత్స అందించేం దుకు సిద్ధంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్ పంపిణీ

**ఖమ్మం (క్రైమ్ మిర్రర్ బ్యూరో):** ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఎన్ ఎస్ పి స్కూల్లోని 10వ తరగతి విద్యార్థులకు పాడ్స్ స్కేల్ పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా యు టి ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చావా దుర్గ భవాని హాజరు కావడం జరిగింది . వారి చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు భయం లేకుండా ఏకాగ్రతతో చదువుకొని మంచి మార్కులు తెచ్చుకోవాలి అన్నారు కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజు ప్రవీణ్ పాఠశాల సిబ్బంది సంధ్య జగన్నాథం మాజీ నాయకురాలు కమల ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షురాలు సాత్విక సింధు ఎస్ఎఫ్ఐ ఖమ్మం డివిజన్ అధ్యక్షులు శ్రీనాథ్ నాయకులు లోకేష్ లోహిత్ కుమార్ శ్యామ్ మనోజ్ జానీ కీర్తన తదితరులు పాల్గొన్నారు




# కేంద్ర పాలకుల అల్పసంతోషం కోసమే హైకోర్టులో అప్పీల్ డ్రామా : కప్పాటి పాండురంగారెడ్డి



బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) రాజకీయ కక్ష సాధింపులో భాగంగా కల్వకుంట్ల కవితపై మోపిన అబద్ధపు కేసుల్లో సీబీఐ ఆడుతున్న నాటకాలు మరోసారి బట్టబయలయ్యాయని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కప్పాటి పాండురంగారెడ్డి విలేఖరులకు అందించిన ఒక ప్రకటనలో విమర్శించారు. ఆధారాలు లేక ట్రయల్ కోర్టు కొట్టేసిన కేసులో మళ్ళీ అప్పీల్ కు వెళ్లడం సీబీఐ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించడమేనని ఆయన దుయ్యబట్టారు. ?ఈ సందర్భంగా ఆయన కోర్టు ఛీత్కారం, సీబీఐ అధికారులపై విచారణ, మూడేళ్ల సుదీర్ఘ విచారణ తర్వాత, కవితపై ఎలాంటి ఆధారాలు లేవని తేల్చిచెబుతూ రౌస్ అవెన్యూ కోర్టు ఈ కేసును కొట్టివేసిన, తప్పుడు విచారణ జరిపిన సీబీఐ అధికారిపైనే విచారణకు ఆదేశించడం ఆ సంస్థకు చెంపపెట్టు లాంటిదని గతంలో కవిత ఫోన్లు ధ్వంసం చేశారని సీబీఐ చేసిన అసత్య ప్రచారాన్ని గుర్తు చేస్తూ, ఆమె స్వయంగా కోర్టుకు ఫోన్లు సమర్పించడంతో సీబీఐ అభాసుపాలైన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కేంద్ర పాలకుల మెప్పు కోసం దర్యాప్తు సంస్థలు ఎంతటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నాయో దీనిని బట్టే అర్థమవుతోందన్నారు. స్థానిక సిబ్బంది ద్వారా ఇచ్చే నోటీసుల కోసం ఢిల్లీ నుంచి అధికారులు రావడం కేవలం మీడియాలో హడావుడి సృష్టించి అల్పసంతోషం పొందే ప్రయత్నమేనని, గతంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయి చేసిన వ్యాఖ్యలు సీబీఐ, ఈడీల పనితీరుకు అద్దం పట్టాయి. మూడేళ్లు వందల మందిని విచారించినా చివరకు రౌస్ అవెన్యూ కోర్టులో నిలవని ఆధారాలు, హైకోర్టులోనో, సుప్రీంకోర్టులోనో నిలుస్తాయని అనుకోవడం వారి భ్రమే అని, ?కేసు కోర్టు పరిధిలో ఉన్నందున ఎక్కువ మాట్లాడలేమని చెబుతూనే, అంతిమంగా ధర్మమే గెలుస్తుందని, కవిత నిష్కళంకమైన నాయకురాలిగా మరోమారు నిరూపణ జరుగుతుందని ధీమా వ్యక్తం చేశారు.



# జెన్‌ఎన్‌యూఆర్‌ఎం క్వార్టర్స్ పున నిర్మాణానికి సహకరించాలని గండిపేట ఎమ్మార్వోకు వినతి

**గండిపేట(క్రైం మిర్రర్):** గ్రేటర్ హైదరాబాద్ 123 డివిజన్ పరిధిలోని గంధంగూడ జేఎన్ఎన్‌యూఆర్‌ఎం క్వాటర్స్ శిథిలావస్థకు చేరుకోని కాలనీ వాసులు తీవ్ర అవస్థలకు గురవుతున్నారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి అన్నారు. సమస్యల తీవ్రతను పరిశీలించిన ఆయన కాలనీ వాసులతో కలిసి గండిపేట ఎమ్మార్వో శ్రీనివాస్‌రెడ్డిని కలిసి గురువారం వినతిపత్రం సమర్పించపారు. ఎమ్మార్వో స్పందిస్తూ కాలనీ వాసులు అందరు కలిసి తీర్మాణం చేసి పంపిస్తే ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి వీలైనంత త్వరగా బాధితులకు నూతన అపార్ట్‌మెంట్‌ను నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్‌కుమార్, రాంప్రసాద్, గణేష్, శ్రీనివాస్, హరీష్‌గౌడ్, బాధిత కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# కిస్మత్‌పూర్ డబుల్‌బెడ్ రూమ్స్‌లో మంచినీటి సమస్య పరిష్కరించాలి

**బీజేపీ సీనియర్ నాయకులు నీరుడు పవన్‌సాయి**



**గండిపేట(క్రైం మిర్రర్):** కిస్మత్‌పూర్ డివిజన్ 122లోని గవర్నమెంట్ డబుల్ బెడ్‌రూమ్స్‌లోని మంచినీటి సమస్యను పరిష్కరించాలని బీజేపీ సీనియర్ నాయకులు నీరుడు పవన్‌సాయి కోరారు. ఈ మేరకు గురువారం హెచ్‌ఎండబ్ల్యూ?యఎస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఖాజాజోహార్ ఆలీని కలిసి వినతిపత్రం సమర్పించారు. డబుల్ బెడ్‌రూమ్స్‌లోని మంచినీటి సమస్యను వివరించి పరిష్కరానికి కృషి చేయాలని కోరారు. దానికి జనరల్ మేనేజర్ ఖాజాజోహార్ ఆలీ సానుకూలంగా స్పందించి వెంటనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# శిక్షణ శిబిరలో చౌటుప్పల్ కౌన్సిలర్ల హాజరు

**చౌటుప్పల్,మార్చి 12, క్రైమ్ మిర్రర్ :** యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో ప్రజా పాలన- ప్రగతిప్రాణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక లో భాగంగా పట్టణ కేంద్రంలోని వి- కన్వెన్షన్,న్యూ వివేరా లో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్ పర్సన్ లకు నిర్వహించిన ఒక్కరోజు అవగాహన శిక్షణ శిబిరంలో చౌటుప్పల్ మున్సిపాలిటీకి చెందిన వివిధ వార్డుల కౌన్సిలర్లు గురువారం హాజరైనారు . ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు,అధికారులు పాల్గొని.. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి పేదవారికి అమలు చేసేలా చూడాలన్నారు.ఈ శిక్షణ కార్యక్రమంలో మున్సిపల్ పాలన, అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై అధికారుల ద్వారా అవగాహన కల్పించారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో ప్రజాప్రతినిధుల పాత్ర, మున్సిపల్ నిధుల వినియోగం, పారిశుద్ధ్యం, పట్టణ అభివృద్ధి వంటి విషయాలపై వివరించారు. ఈ శిక్షణ శిబిరంలో పాల్గొన్న చౌటుప్పల్ కౌన్సిలర్లు తమ వార్డుల అభివృద్ధికి ఈ అవగాహన ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ భాస్కరరావు, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్, వివిధ గ్రామాల సర్పంచులు, మున్సిపల్ కౌన్సిలర్లు, చైర్ పర్సన్ లు, అధికారులు పాల్గొన్నారు.







## వివాహ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న దైద రవీందర్

**రామన్నపేట క్రైమ్ మిర్రర్:** రామన్నపేట మండలం జనంపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చలమల్ల లింగా రెడ్డి కుమార్తె అఖిల రెడ్డి వివాహ మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించిన దైద రవీందర్ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గార్లపాటి రవీందర్ రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పేరుతో రైతులకు అన్యాయం చేయొద్దు



**తుర్కయంజాల్, మార్చి 12:** జీహెచ్ఎంసీ ఆదిభట్ల తొర్రూరు డివిజన్ పరిధి కోహెడలో అభివృద్ధి పేరుతో ప్రభుత్వం రైతుల భూములు లాక్కోవడం సరైనది కాదని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. భూములు నష్టపోతున్న రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ తుర్కయంజాల్ అధ్యక్షుడు ఎలిమినేటి నర్సింహారెడ్డి, రైతులతో కలిసి ఫ్రూట్ మార్కెట్, ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ కోసం ప్రభుత్వం తీసుకుంటున్న భూములను బూర నర్సయ్యగౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా ఎస్సీ, బీసీ రైతులు సాగు చేసుకుంటున్న భూములను ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా, ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకోవడం దారుణమన్నారు. సర్కార్ చర్యలతో రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. భూములనే నమ్ముకొని, సాగుపైనే ఆధారపడి బతుకుతున్న రైతుల కుటుంబాలు రోడ్డున పడే దుస్థితి వచ్చిందన్నారు. ప్రభుత్వ చేపట్టి అభివృద్ధి కార్యక్రమాలకు తాము వ్యతిరేకం కాదని.. కానీ అభివృద్ధి పేరుతో రైతులకు అన్యాయం చేయడం సరికాదని బూర హితవు పలికారు. ప్రభుత్వం రైతులకు వెంటనే నష్టపరిహారంతో పాటు ప్లాట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు రైతులకు బీజేపీ అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడొద్దని నర్సయ్యగౌడ్ భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కొత్త రాంరెడ్డి, బచ్చిగళ్ల రమేష్, కొండ్రు పురుషోత్తం, కందాల బలదేవరెడ్డి, కరాడి శ్రీలత అనిల్‌కుమార్, భిక్షపతి, యూసుఫ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వ్యర్థాల నిర్వహణపై అవగాహన సమావేశం

### పాల్గొన్న సర్పంచ్ నాగంపల్లి శ్యామ్ సుందర్



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** నల్గొండ జిల్లా చిట్యాల మండలం పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు మరియు పరిశుభ్రతపై అవగాహన సమావేశం సర్పంచ్ నాగంపల్లి శ్యామ్ సుందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని చికెన్ షాపులు, మటన్ షాపులు, కోళ్ల ఫారాలు, కిరాణా షాపు యజమానులతో పంచాయతీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో చికెన్, మటన్ వ్యర్థ పదార్థాలను ఆరు బయట వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. అలాగే ప్లాస్టిక్ కవర్లు వినియోగించకూడదని సమావేశంలో తీర్మానించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జంజి రాజు, పంచాయతీ సెక్రటరీ శారద, కిరాణా షాపు యాజమానులు, కోళ్ల ఫారం యాజమానులు, వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

# అధికారపు మత్తులో నైతికత చిత్తు అవుతోందా?

అధికారం ఈ రెండక్షరాల పదంలో ఎంతటి అయస్కాంత శక్తి ఉందో కదా! ఒక సామాన్యుడిని పాలకుడిగా మార్చే సత్తా దీని సొంతం. అధికారం లేనివాడు దాని కోసం అహర్నిశలూ తపిస్తాడు,అది చేతికి చిక్కినవాడు దాన్ని కాపాడుకోవడానికి, ఆ పీఠాన్ని వదలకూడదని ప్రాణాలకు తెగిస్తాడు. కానీ, ఈ అధికారపు వెలుగుల్లో మనిషిలోని నైతికత అనే దీపం ఏమవుతోంది? పదవీ వ్యామోహంలో పడి తన విలువలను, ఆదర్శాలను, కనీస మానవత్వాన్ని మనిషి కోల్పోతున్నాడా? లేక అధికారం అండతో తనలోని ఉత్తమ గుణాలను మరింత పదును పెట్టుకుంటున్నాడా? ఈ ప్రశ్న నేటి సమాజానికి అత్యంత అవసరం. చరిత్ర పుటలు తిరగేసినా, మనోవిజ్ఞాన శాస్త్రవేత్తల పరిశోధనలు చూసినా అధికారం మరియు నైతికత మధ్య జరిగే ఈ ద్వంద్వ యుద్ధం ఎంతో ఆసక్తికరంగా కనిపిస్తుంది. ప్రముఖ దార్శనికుడు లార్డ్ యాక్టన్ ఒకానొక సందర్భంలో అన్న మాటలు నేటికీ అక్షర సత్యాలు అధికారం మనిషిని అవినీతిపరుడిని చేస్తుంది,సంపూర్ణ అధికారం మనిషిని సంపూర్ణంగా భ్రష్టుడిని చేస్తుంది. ఈ మాటల్లో ఎంతటి గంభీరమైన హెచ్చరిక ఉందో గమనించండి. అధికారం అనేది ఒక కూడలి వంటిది. అక్కడ నిలబడిన మనిషి ముందు రెండు దారులు ఉంటాయి. ఒకటి తన చేతిలోని శక్తిని జనశ్రేయస్సు కోసం, వ్యవస్థల ప్రక్షాళన కోసం ఉపయోగించే రాజమార్గం. రెండు అహంకారం, స్వార్థం, అవినీతి అనే ఊబిలోకి దిగిపోయే వినాశకర మార్గం. చాలామంది నాయకులు తమ ప్రస్థానాన్ని ఎంతో ఉదాత్తమైన ఆశయాలతోనే ప్రారంభిస్తారు. తొలినాళ్లలో ప్రజలకు చేరువగా ఉంటూ, వారి కష్టాలను తీరుస్తూ మంచి పేరు సంపాదించుకుంటారు. కానీ, కాలక్రమేణా ఆ అధికారపు మత్తు తలకెక్కుతుంది. ఎప్పుడైతే జవాబుదారీతనం తగ్గుతుందో, విమర్శించే గొంతులు నొక్కబడతాయో, అప్పుడు మనిషిలోని నైతిక స్పృహ మెల్లమెల్లగా కొడిగడుతుంది. ఇది కేవలం మాటలకే పరిమితం కాదు, ఆధునిక సైన్స్ కూడా దీన్ని ధృవీకరించింది. అధికారం మనిషి మెదడుపై ఎలా పనిచేస్తుందో తెలుసుకోవడానికి స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో 1971లో జరిగిన జింబార్డో జైలు ప్రయోగం ఒక క్లాసిక్ ఉదాహరణ. కొందరు సాదాసీదా విద్యార్థులను తీసుకుని, వారిలో కొందరిని జైలు గార్డులు గా, మరికొందరిని ఖైదీలుగా విభజించారు. కేవలం ఆరు రోజుల్లోనే ఆ గార్డులు అత్యంత క్రూరంగా ప్రవర్తించడం మొదలుపెట్టారు. అంటే, మనిషిలోని నైతికత కంటే అతను ధరించే ముసుగు లేదా అతనికి దక్కిన హోదా అతని ప్రవర్తనను శాసిస్తుందని ఈ ప్రయోగం తేల్చింది. మనోవిజ్ఞాన శాస్త్రంలో ూాశీషవతీ ూaతీaసశీఞ (అధికార విరోధాభాస) అనే ఒక ఆసక్తికరమైన భావన ఉంది. డాకర్ కెల్ట్నర్ అనే శాస్త్రవేత్త ప్రకారం ఒక వ్యక్తి అధికారంలోకి రావడానికి మొదట అతనికి ఇతరులతో సహకరించే గుణం, సామాజిక స్పృహ, నైతికత అవసరం అవుతాయి. కానీ, తీరా అధికారం చేతికి చిక్కాక, అవే లక్షణాలు మటుమాయం అవుతాయి. న్యూరో సైన్స్ పరిశోధనల ప్రకారం, అధికారం అనేది మెదడులోని ఎంపతీ (జుఎజూథ్ష్రం) అంటే ఇతరుల బాధను అర్థం చేసుకునే సామర్థ్యాన్ని తగ్గిస్తుందట. దీనివల్ల అధికారి క్రమంగా నిర్దయుడిగా, తన స్వార్థమే పరమావధిగా ఆలోచించే వ్యక్తిగా మారిపోతాడు. చరిత్రను గమనిస్తే, అధికారం నైతికతను ఎలా నాశనం చేసిందో చెప్పడానికి హిట్లర్, స్టాలిన్, పోల్ పాట్ వంటి పేర్లు చాలు. వీరంతా ఒకప్పుడు ప్రజల కోసం, తమ దేశం కోసం పోరాడిన వారే. కానీ, పీఠం ఎక్కాక వారి అంతరంగం మారిపోయింది. లక్షలాది మంది ప్రాణాలను తీయడానికి కూడా వారు వెనుకాడలేదు. భారత చరిత్రలో కూడా బ్రిటిష్ వారిని గడగడలాడించిన ఎందరో నేతలు, స్వాతంత్ర్యం వచ్చాక అవినీతి పంకిలంలో కూరుకుపోయిన ఉదాహరణలు ఉన్నాయి.



స్వజన పక్షపాతం, అరాచకం అనేవి అధికారపు నీడలో పెరిగే విషవృక్షాలు. అయితే, నాణేనికి మరోవైపు కూడా ఉంది. అధికారాన్ని నైతికతతో మేళవించి యుగపురుషులుగా నిలిచిన వారూ ఉన్నారు. కళింగ యుద్ధం తర్వాత జరిగిన మారణహోమాన్ని చూసి చలించిపోయి, తన అధికారాన్ని అహింసకు, ధర్మ ప్రచారానికి అంకితం చేశాడు. ఒక చక్రవర్తి తన తప్పును తెలుసుకుని నైతికత వైపు మళ్లడం అరుదైన విషయం. అమెరికా అంతర్యుద్ధం సమయంలో అధ్యక్షుడిగా ఉండి, బానిసత్వ నిర్మూలన కోసం తన అధికారాన్ని పణంగా పెట్టాడు. మానవ గౌరవమే అన్నిటికంటే మిన్న అని నిరూపించాడు. 27 ఏళ్ల జైలు జీవితం తర్వాత అధికారంలోకి వచ్చినా, తనను హింసించిన వారిపై ప్రతీకారం తీర్చుకోలేదు. మన్నింపు, సమైక్యత అనే నైతిక విలువలతో దక్షిణాఫ్రికాను నడిపించారు. మన తెలుగు సాహిత్యం, పురాణాలు అధికారం గురించి ఎన్నో నీతులను బోధించాయి. రాజు ప్రజలకు సేవకుడు అన్నది మన ప్రాచీన ధర్మం. మహాభారతంలో ధర్మరాజు పాత్ర ద్వారా నైతిక అధికారానికి ఒక అద్భుతమైన నమూనాను నన్నయ మనకు అందించారు. పోతన భాగవతంలో ప్రహ్లాదుడు తన తండ్రి హిరణ్యకశిపుడి అపరిమిత అధికారాన్ని ఎదిరించి, నైతికతకే పట్టం కట్టాడు. కానీ నేటి వాస్తవ పరిస్థితులు ఎలా ఉన్నాయి? రాజకీయాల్లో చూసినా, కార్పొరేట్ సంస్థల్లో చూసినా అధికారం ఉంటే ఏ తప్పు చేసినా చెల్లుబాటు అవుతుందనే భావన పెరిగిపోయింది. కులం, ధనం అనేవి అధికారానికి ఇంధనాలుగా మారుతున్నాయి. అధికారం ఉన్న వ్యక్తి చెప్పే అబద్ధం కూడా వేదవాక్కులా చలామణీ అవుతోంది, పేదవాడి నిజం గాలిలో కలిసిపోతోంది. ఈ వ్యవస్థీకృత అన్యాయం సమాజంలోని నైతిక విలువలను కుంగదీస్తోంది. అధికారపు వేడిలో నైతికత కరిగిపోకుండా ఉండాలంటే కొన్ని కఠినమైన చర్యలు అవసరం. అధికారం ఉన్న ప్రతి వ్యక్తి తన ప్రతి నిర్ణయానికి ప్రజలకు లేదా చట్టానికి సమాధానం చెప్పేలా ఉండాలి. పారదర్శకత ఉన్నచోట అవినీతికి తావుండదు. మొత్తం అధికారం ఒకే చేతిలో ఉంటే అది ప్రమాదకరం. అధికారాలను పంచడం వల్ల ఒకరిపై ఒకరికి పర్యవేక్షణ ఉంటుంది. చిన్నతనం నుండే నైతిక విలువలు, మానవీయత కలిగిన విద్యను అందించాలి. పునాది బలంగా ఉంటే ఏ పదవి వచ్చినా వ్యక్తిత్వం చెదిరిపోదు. అధికారాన్ని ప్రశ్నించే సత్తా ప్రజలకు ఉండాలి. ప్రజలు నిద్రపోతే పాలకులు నిరంకుశులు అవుతారు. నిరంతరం ప్రశ్నించే సమాజమే అధికారానికి నైతిక కవచం. అధికారం అనేది ఒక మనిషిని మార్చదు; అది అతనిలో నిద్రిస్తున్న అసలు రంగును బయటపెడుతుంది. లోపల మంచి ఉంటే అది సమాజానికి వెలుగునిస్తుంది, లోపల కుటిలత్వం ఉంటే అది విధ్వంసాన్ని సృష్టిస్తుంది. భారతీయ తత్వశాస్త్రం చెప్పిన ధర్మం అంటే ఇదే. ఫలితం కోసం కాకుండా, కేవలం ప్రజల శ్రేయస్సు కోసం తన బాధ్యతను నిర్వర్తించేవాడే నిజమైన నాయకుడు. అధికారం అనేది ఒక అమూల్యమైన ఆయుధం. దాన్ని నైతికత అనే ఒరలో ఉంచినంత కాలమే దానికి గౌరవం. లేదంటే అది పట్టుకున్న వాడిని, చుట్టూ ఉన్న సమాజాన్ని కూడా నరికివేస్తుంది. అందుకే, అధికారం కంటే ముందు నైతికతను బలపరచుకోవడం ప్రతి మనిషికీ, ముఖ్యంగా నేటి యువతకు అత్యవసరం.

డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న రాష్ట్ర గవర్నర్







### స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్,ఎస్పీ, శాసనసభ్యులు

**యాదాద్రి జిల్లా, మార్చి 12, క్రైమ్ మిర్రర్ :** తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ్మస్వామి పుణ్యక్షేత్రాన్ని గురువారం కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. రాష్ట్ర గవర్నర్ కు ప్రభుత్వ విప్ ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య,జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ , రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి,రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి గవర్నర్ కు పూల మొక్కలు బహుకరించి స్వాగతం పలికారు. తొలుత రాష్ట్ర గవర్నర్ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. వేద పండితులు,అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి భావానీ శంకర్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు, వేద పండితులు ఆలయ సంప్రదాయంతో పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. గవర్నర్ ధ్వజ స్తంభం వద్ద మొక్కి స్వామి వారి అంతరాలయంలో అర్చన పూజలు నిర్వహించారు. కార్య నిర్వాహణాధికారి స్వామి వారి మెమొంటోను అందచేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త స్వామి వారి ప్రసాదాన్ని గవర్నర్ కు అందచేశారు. అనంతరం అనుబంధ దేవాలయం శ్రీ పర్వత వర్ధిణి సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో స్ఫటిక లింగానికి గవర్నర్ దంపతులు అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు,ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# గ్యాస్ అక్రమ నిల్వలపై కఠిన చర్యలు తీసుకుంటాం.: కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం మార్చి 12:** జిల్లాలో గ్యాస్ సిలిండర్ల అక్రమ నిల్వలు, గ్యాస్ సిలిండలను బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. గురువారం ఐడీఓసి కార్యాలయంలో వ్యవసాయ శాఖ, ఇరిగేషన్ శాఖ, పౌరసరఫరాల శాఖల పనితీరుపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ సంబంధిత అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయానికి సంబంధించిన సాగుభూమి వివరాలు, ప్రస్తుత సాగు పరిస్థితులు, ప్రధాన పంటల వివరాలు, రైతులకు అందుతున్న ప్రభుత్వ పథకాల అమలు పరిస్థితులపై వ్యవసాయ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రైతుభరోసా, రైతు భీమా పథకాల అమలు, లబ్ధిదారుల సంఖ్య, రైతులకు అందుతున్న ప్రయోజనాలపై సమగ్ర సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలో పంటల వారీగా సాగు విస్తీర్ణం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై వివరాలు అధికారులకు అడిగి తెలుసుకున్నారు . ఇరిగేషన్ శాఖ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో ఉన్న నీటి వనరులు, చెరువులు, కాలువలు, ప్రాజెక్టులు, వాటి పరిధిలోని ఆయకట్టు విస్తీర్ణం, సాగునీటి లభ్యత తదితర అంశాలపై సమగ్ర సమాచారం తెలుసుకొని,జిల్లాలో సాగునీటి వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ రైతులకు అవసరమైన నీటిని సకాలంలో అందించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పౌరసరఫరాల శాఖకు సంబంధించి జిల్లాలో పనిచేస్తున్న రేషన్ దుకాణాల సంఖ్య, లబ్ధిదారులకు అందుతున్న సన్నబియ్యం పంపిణీ వివరాలు, నిల్వలు, సరఫరా పరిస్థితులపై కలెక్టర్ సమీక్షించారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి సమయానికి నాణ్యమైన రేషన్ సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు . ఈ సందర్భంగా జిల్లాలో గ్యాస్ నిల్వల పరిస్థితిపై కూడా కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో గ్యాస్ నిల్వలు తగినంతగా ఉన్నప్పటికీ, వినియోగదారులు కొరత ఏర్పడుతుందనే భయంతో ముందుగానే అధిక మొత్తంలో బుకింగ్ చేయడం వల్ల కొన్నిచోట్ల తాత్కాలిక సమస్యలు తలెత్తుతున్నాయని అధికారులు తెలిపారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ప్రజల్లో సరైన అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో గ్యాస్ సరఫరాలో ఎలాంటి కొరత లేదని ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. అలాగే గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేయడం, బ్లాక్ మార్కెట్‌లో విక్రయించడం వంటి చర్యలను కట్టడి చేయడానికి ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. గ్యాస్‌ను అక్రమంగా నిల్వ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శుక్రవారం 13-3-2026


# బునాధిగాని కాల్వకు నీరు రాదా..!

- కాల్వ తవ్వకాలు ప్రారంభించి సుమారుగా 22 సంవత్సరాలు
- టిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయింది.
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 2 సంవత్సరాలు గడిచిపోయింది. పూర్తి చేసి నీళ్లు వదులుతారా!లేదా!
- చూడాలి... రైతులకు పారే నీళ్ల లేక కన్నీళ్లా..!



**క్రైమ్ మిర్రర్,ఆత్మకూరు(ఎం) మార్చి 12:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండల కేంద్రం నుండి వెళ్ళే బునాధిగాని కాల్వకు నీరు రావటం కల్లేనా!రైతుల ఆశలు ఆడియాసలేనా! ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రామన్నపేట అసెంబ్లీ నియోజకవర్గం ఎమ్మెల్యే ఉప్పునూతల పురుషోత్తం రెడ్డి అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర రెడ్డి ద్వారా మంజూరు చేయించి కాల్వ తవ్వకాన్ని ప్రారంభింపచేశారు. కానీ పూర్తి చేయలేకపోయారు.తెలంగాణ ఉద్యమం మొదలైంది. అప్పుడే నియోజకవర్గాల పునర్విభజన జరిగి రామన్నపేట నియోజవర్గన్ని మూడు ముక్కలు చేసారు.అదే సమయంలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చేయాలని ఉద్యమం ఉదృతమైంది.పురుషోత్తం రెడ్డికి బలమైన క్యాడర్ లేకుండా చేయాలని చేసారు. పురుషోత్తం రెడ్డి పూర్తి చేయలేకపోయారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమ నేత కేసీఆర్ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కాల్వను పూర్తి చేస్తారని రైతులు, ప్రజలు బావించారు.కానీ ప్రజల ఆశలు ఆడియాసలే అయ్యాయి. పది సంవత్సరాలు ప్రభుత్వాన్ని నడిపిన కేసీఆర్ అప్పటి ఆలేరు నియోజకవర్గ టిఆర్ఎస్ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి సోంత డబ్బులతో కాల్వపనులను చేయిస్తున్నని త్వరలోనే నీరు వస్తుందని తెలిపారు.వారి మాటలు ఉత్త మాటలే..!అయ్యాయి.ఆ తర్వాత ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాలు అవుతున్నది. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఇదిగో నీళ్లు అదిగో నీళ్లు అంటున్నారు తప్ప వచ్చింది లేదు పారిందీ లేదు అంటున్న రైతులు ప్రజలు. ఈ ప్రభుత్వం కాల పరిమితీ ముగిసేలోగా ఈ బునాధిగాని కాల్వ పూర్తి అయ్యి నీళ్లు వచ్చేనా!అంటున్న రైతులు ప్రజలు. కాల్వ ప్రారంభించి సూమారుగా 22 సంవత్సరాలు కావస్తున్నాను పూర్తి కాదా!నీళ్లు రావా!ఏ పార్టీ ప్రభుత్వం వచ్చిన ఏక్కడ వేసింది అక్కడనే అనే విధంగా ఉంటుంది తప్పా...!నీళ్లు పారేది లేదు రైతులు సంతోషించేది లేదు. ఈ బునాధిగాని కాల్వ ఎప్పటికీ పూర్తి అయ్యేనో...!



## కుల మతాలకతీతంగా అందరూ సోదరబావంతో మెలగాలి

### రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల.

**భద్రాద్రి కొత్తగూడెం మార్చి 12:** సమాజం లోని ప్రతి ఒక్కరు కుల మతాలకతీతం గా అందరూ సోదర భావం తో జీవించాలని రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాస రావు అన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పాత పాల్వంచ డివిజన్ నందుగల మజీద్ - ఎ - మహ్మ దీయ కమిటీ ఆధ్వర్యం లో గురువారం నాడు కొత్వాల తో పాటు 47 వ డివిజన్ కార్పొ రేటర్ గుర్రం వెంకటేశ్వర్లు (జీవీఆర్ ) పూలమాలలు, శాలువాతో సన్మానించారు. ఈ సందర్బంగా కొత్వాల మాట్లాడుతూ అన్నీ కులాల సారాంశం ఒక్కటే అనీ, ప్రతీ ఒక్కరూ మానవత్వంతో మెలుగుతూ పేద వారికి సహాయపడాలన్నారు. ఈ కార్యక్రమం లో మజీద్ కమిటీ సభ్యు లు షేక్ జాని మియా, ఎండీ . ఇమామ్ , షేక్ ఖాజామియా, షేక్ ఖాయ్యుం, కరీం, షేక్ ఫాకీర్ షేక్ అజ్మత్ అలీ, షేకు యాకుబ్ అలీ, షేక్ జాకీర్, షేక్ యాకూబ్, షేక్ గుమ్ము, షేక్ బల్లు, షేక్ ఖాసీం, షేక్ రంజాన్ అలీ, షేక్ జానీ, వనమా సత్యనారాయణ, చిన్న పండు తదితరులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్‌లోనే గ్యాస్ సిలిండర్ బుకింగ్ చేయాలి

### నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: అదనపు కలెక్టర్



**మంచిర్యాల, మార్చి 12: (క్రైమ్ మిర్రర్) :** గ్యాస్ వినియోగదారులు సిలిండర్లను తప్పనిసరిగా ఆన్‌లైన్ ద్వారానే బుక్ చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవిన్యూ)శ్రీనివాస్ రావు సూచించారు. గురువారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో ఎల్‌పీజీ డీలర్లతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్యాస్ కంపెనీల సేల్స్ అధికారులతో ఫోన్ ద్వారా చర్చించారు.జిల్లాలో గృహ అవసరాల కోసం వినియోగించే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లకు ఎలాంటి కొరత లేదని ఆయన తెలిపారు.వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీలు లేదా గోదాముల వద్దకు వెళ్లకుండా ఆన్‌లైన్ ద్వారా మాత్రమే బుకింగ్ చేసుకోవాలని సూచించారు. సింగిల్ సిలిండర్ ఉన్నవారు 25 రోజుల తర్వాత, డబుల్ సిలిండర్ ఉన్నవారు 30 రోజుల తర్వాత బుకింగ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు.గ్యాస్ డెలివరీ సమయంలో వినియోగదారులు డెలివరీ బాయ్‌కు ఓటీపీ తెలియజేసి సహకరించాలని కోరారు. హోటళ్లు, రెస్టారెంట్లలో వాణిజ్య సిలిండర్లనే వినియోగించాలని, నిబంధనలకు విరుద్ధంగా డొమెస్టిక్ సిలిండర్లు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌లో సిలిండర్లు విక్రయిస్తే నిత్యావసర సరుకుల చట్టం--1955 కింద చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఎల్‌పీజీ వినియోగదారులు కేవైసీ తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని, గ్యాస్ ఏజెన్సీలు లేదా ఆన్‌లైన్‌లో గ్యాస్ కంపెనీల అధికారిక వెబ్‌సైట్, యాప్‌ల ద్వారా పూర్తి చేసుకోవచ్చని చెప్పారు. సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## సంబంధం లేని ఫంక్షన్లలో భోజనం చేయడం నేరమా?

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 12:** అపరిచితుల శుభకార్యాల్లో పిలవకుండా వెళ్లి భోజనం చేయడం అనేది మనం చట్టపరంగా పెద్ద నేరంగా భావించకపోవచ్చు.కానీ ఇది నేరమే అవుతుంది!భారతీయ న్యాయ వ్యవస్థ ప్రకారం, అనుమతి లేకుండా ఇతరుల ప్రైవేట్ ప్రాపర్టీలోకి ప్రవేశించడం మరియు అక్కడ వస్తువులను వినియోగించడం ఈ కింది సెక్షన్ల కిందకు రావచ్చు:క్రిమి'నల్ ట్రెస్పాస్: ఒకరి అనుమతి లేకుండా వారి ఇంటికి లేదా ఫంక్షన్ హాల్‌లోకి వెళ్లడం.దొంగతనం లేదా మోసం: ఆహారాన్ని దొంగతనంగా తినడం లేదా ఆహ్వానితుడిలా నటించి మోసం చేయడం కింద పరిగణించవచ్చు.ఒకవేళ పట్టుబడితే పోలీసులకు ఫిర్యాదు చేసే అవకాశం ఉంది మరియు భారీ జరిమానా కూడా విధించవచ్చు.మన సంస్కృతిలో ఆకలితో ఉన్నవారికి పెట్టడం పుణ్యం.కానీ ఇలా కావాలని ఫంక్షన్లలోకి చొరబడటం అనేది నైతికంగా కూడా సరైనది కాదు.ఫంక్షన్ నిర్వహించేవారికి ప్లేట్ల లెక్కన క్యాటరింగ్‌కు డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది.పిలవని వారు రావడం వల్ల అసలైన బంధువులకు భోజనం అందకపోవడమే కాకుండా, యజమానికి ఆర్థిక భారం పడుతుంది.

## కాలిపోయిన ఈత చెట్లకు వాటర్ ట్యాంకర్ పెట్టి నీళ్లు పోస్తున్న గౌడ సంఘం అధ్యక్షులు ఉపాధ్యక్షులు కమిటీ సభ్యులు

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 12:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పల్లెర్ల గ్రామంలో రెండు రోజుల క్రితం 600 ఈత చెట్లు కాలిపోవడం జరిగింది.వాటికి గౌడ సంఘం అధ్యక్షులు ఉపాధ్యక్షులు కమిటీ సభ్యులు కలిసి వాటర్ ట్యాంకర్ పెట్టి గురువారం రోజున నీళ్లు పోయడం జరిగింది.



## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో ప్రజాప్రతినిధులదే

# కీలక పాత్ర: జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





### 99 రోజుల ప్రత్యేక కార్యాచరణపై ప్రజాప్రతినిధులకు శిక్షణ

### అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా మౌలిక వసతుల కల్పన

### పాల్గొన్న డిసిపి భాస్కర్, అదనపు కలెక్టర్ చంద్రయ్య

**రామకృష్ణాపూర్ మార్చి 12 (క్రైమ్ మిర్రర్) :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేయడంలో ప్రజాప్రతినిధుల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. గురువారం క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలోని అమ్మ గార్డెన్స్‌లో గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, మున్సిపల్ మేయర్లు, చైర్‌పర్సన్లు, కౌన్సిలర్లకు 99 రోజుల ప్రగతి ప్రణాళికపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల పాటు సాగే ఈ ప్రత్యేక కార్యాచరణ ద్వారా పారిశుధ్యం, పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్, విద్యా రంగం సామాజిక అంశాలపై దృష్టి సారించనున్నట్లు తెలిపారు.అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుత్, తాగునీరు, మూత్రశాలలు వంటి మౌలిక వసతులను నాణ్యతతో నిర్మిస్తున్నామని, ఇందులో స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వాములను చేశామని తెలిపారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు మంజూరు చేస్తామని, పథకాల అమలులో పారదర్శకత పాటించాలని సూచించారు. గతంలో లబ్ధి పొందిన వారిని గుర్తించి, కొత్తవారికి అవకాశం కల్పించేలా చూడాలన్నారు.నిరుద్యోగ యువత బాట తప్పకుండా మాదకద్రవ్యాల నిరోధంపై దృష్టి సారించాలని, రహదారి భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, విద్యుత్ ఆదా కోసం సోలార్ దీపాలపై మొగ్గు చూపాలని సూచించారు.మున్సిపల్ నిధులను సక్రమంగా వినియోగిస్తూ ప్రజా ప్రయోజనకర కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ ప్రజాప్రతినిధులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, వివిధ శాఖల అధికారులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595



# సొంతింటి కల కాంగ్రెస్ తోనే సాధ్యం

## టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు

**భద్రాద్రి కొత్తగూడెం మార్చి 12:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం గరీబ్ పేట గ్రామానికి చిలువేరు పుల్లయ్య నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు హాజరై లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ఇందిరమ్మ ఇల్లు గూడు లేని నిరుపేదలకు వరాల జల్లు అని అన్నారు. నిరుపేదలను ఇంటి యజమానులను చేసే కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరావు సారథ్యంలో దానిని అంకితభావంతో జిల్లాలో నిర్వహిస్తున్నామని వెల్లడించారు. త్వరలోనే 2వ విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కార్యక్రమం ఉంటుందని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మన రెవిన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ద్వారా ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రోహిణి,ఉప సర్పంచ్ రెడ్డి బోయిన వెంకన్న , ఎక్స్ ఎంపీటీసీ కసనబోయిన భద్రం, ఎక్స్ ఎంపీటీసీ శైలజ,జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షులు యండి కరీం పాషా, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నర్సింగ్ బిక్షం,పెద్ద వెంకన్న, సైదులు,బైకాని ఉపేందర్,సుజాతనగర్ మండల ఓబీసీ అధ్యక్షులు కసన బోయిన లక్ష్మణ్, టౌన్ ఓబీసీ అధ్యక్షులు జయప్రకాష్,సోషల్ మీడియా అధ్యక్షులు బీరెల్లి వీరభద్రం,వార్డు సభ్యులు కట్టెబోయిన లింగమల్లు ,మాలోత్ రాజు, మరియు గ్రామస్థులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

# మందమర్రి ఏరియాలో ఆడిట్ కమిటీ సమావేశం



**మందమర్రి మార్చి 12 (క్రైమ్ మిర్రర్) :** మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో గురువారం ఆడిట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్.ఓ. టు జి.ఎం జి.ఎల్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై సమావేశాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఇంటర్నల్ ఆడిట్ డివైజీఎం (ఎఫ్ అండ్ ఏ) డి. దామోదర్ రావు 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఆడిట్ రికవరీలు, పెండింగ్‌లో ఉన్న ఆడిట్ మెమోలు, హౌస్ బిల్డింగ్ లోన్ ఇంట్రెస్ట్ రీయింబర్స్‌మెంట్ స్కీమ్‌కు సంబంధించిన క్లెయిమ్ వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.సమావేశంలో ఎస్కే గ్రూప్ ఏజెంట్ అబ్దుల్ ఖాదీర్, ఏరియా ఇంజనీర్ (ఈ అండ్ ఎం) బాలాజీ భగవతి, డీజీఎం పర్సనల్ అశోక్, డివై ఫైనాన్స్ మేనేజర్ సరిత, సివిల్ ఎస్ఈ శ్రీధర్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ సత్యనారాయణ, సీనియర్ అకౌంట్ ఆఫీసర్ జె. శేషు కుమార్, జూనియర్ అకౌంటెంట్లు ఉదయ్ కిరణ్, డి. రాజశేఖర్, మందమర్రి ఏరియాలోని వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టకు వచ్చిన గవర్నర్ ని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 12:** తెలంగాణ రాష్ట్ర నూతన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గురువారం రోజు యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి స్వామివారి దేవస్థానాన్ని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా గవర్నర్ ని ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మర్యాదపూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించి,గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా శు భాకాంక్షలు తెలియజేశారు.



# అల్లాహ్ దయతో అందరికీ మంచి జరగాలి..





## ఇఫ్తార్ విందులో మంత్రి తుమ్మల.

**ఖమ్మం ( క్రైమ్ మిర్రర్ బ్యూరో):** రంజాన్ పవిత్ర మాసంలో అందరికీ మంచి జరగాలని, సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో పయనిస్తుందని, మీ మస్జిద్ ల అభివృద్ధి కోసం తన శాయశక్తుల కృషి చేస్తానని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఖమ్మం నగరంలోని 40 వ డివిజన్ లో రాష్ట్రప్రభుత్వం తరపున ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సోదర భావానికి ఇఫ్తార్ విందులు సోదరభావానికి ప్రతీక అని, అల్లాహ్ దయతో ముస్లిం మైనార్టీల సమస్యలు పరిష్కారశీ అవుతాయని కోరారు. మీరంతా ఎంతో నిష్టతో చేస్తున్న రంజాన్ ఉపవాసదీక్షలు యావత్ మానవాళికి మేలు జరగాలని పేర్కొన్నారు. ముస్లిం మైనారిటీల అభ్యున్నతే తన ధ్యేయమని మంత్రి తుమ్మల అన్నారు. ఖమ్మం నియోజకవర్గం లో షాదీఖానాలు, ఖాబరస్తాన్ లు, ఇతర మౌలిక సదుపాయాల అంశంలో తనను సంప్రదించాలని, మీ మతపెద్దలు, మస్జిద్ కమిటీలు, ముస్లిం సంఘాల ద్వారా మీ విజ్ఞప్తుల మేరకు వాటిని పాటిష్కరించేశీదుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.. గత పది రోజుల క్రితం తాను తన కుటుంబ సభ్యుల వైద్య చికిత్స కోసం దుబాయ్ దేశంలో ఉన్నానని అక్కడ ముస్లిం మైనార్టీలు ఎంతో నిష్టతో ఉపవాస దీక్షలు నిర్వహించడం చూశానని, ఇక్కడ కూడా మన ముస్లిం మైనార్టీ సోదరులు అంతే నిష్టతో నిబద్ధతతో కఠోర ఉపవాస దీక్షలు నిర్వహిస్తున్నారని ఆ అల్లాహ్ ఆశీర్వాదంతో సకల జనులు క్షేమంగా ఉండాలని మంత్రి కోరారు. ఇఫ్తార్ విందు కు తొలుత ఇస్లాం బోధనలు మహమ్మద్ ప్రవక్త సూచనలు, రంజాన్ మాస ఉపవాస దీక్ష అంశాలను విన్నవించిన అనంతరం ఇఫ్తార్ లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముస్లిం సోదరులకు ఖర్జూర తినిపించారు.. ఈకార్యక్రమంలో ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహార, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ అశ్రీఫ్, పార్టీ సీనియర్ నాయకులు సాదు రమేష్ రెడ్డి, మాజీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్, సీనియర్ నాయకులు రషీద్, ఎస్ కె. మార్బుల్స్ అధినేత ఖాసిం, ముస్లిం మైనార్టీ సంక్షేమ అధికారి ఎమ్ డి. ముజాహిద్ , కాంగ్రెస్ నాయకులు ఖాదర్ తదితరులు పాల్గొన్నారు

# ముస్లిం మైనార్టీ సోదరులకు రంజాన్ మాసం శుభాకాంక్షలు...







రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఏదులాపురం మున్సిపాలిటీ ప్రాంతం వరంగల్ క్రాస్ రోడ్డులోని మస్జిద్ ఏ ఉమర్ లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ పార్టీలో పాల్గొన్న మంత్రి పొంగులేటి

**ఖమ్మం (క్రైమ్ మిర్రర్ బ్యూరో):** ముస్లిం మైనార్టీ సోదరులకు రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం ఏదులాపురం మున్సిపాలిటీ ప్రాంతం వరంగల్ క్రాస్ రోడ్డులోని మస్జిద్ ఏ ఉమర్ లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ పార్టీలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ముస్లీం సోదరులు రోజా ఉంటూ ప్రార్థిస్తూ అందరూ చల్లగా ఉండాలని కోరుకుంటారని తెలిపారు. రంజాన్ పండుగ అద్భుతం గా జరుపుకునే ముస్లిం సోదరులకు ముందస్తుగా మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు పేదలకు అందిస్తున్నదని, వీటిని ముస్లిం సోదరులకు అందే విధంగా చర్యలు చేపట్టామని అన్నారు.ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ముస్లిం మైనార్టీ సోదరులకు పూర్తి రక్షణ ఇస్తూ అభివృద్ధి సంక్షేమం తగ్గకుండా చర్యలు తీసుకుంటుందని అన్నారు.లిజిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా భగవంతుడు ప్రతి ఒక్కరికి మంచి ఆరోగ్యం, చల్లగా చూడాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, ఎదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ అనిత, ఖమ్మం రూరల్ మండలం తహసీల్దార్ రాంప్రసాద్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, ముస్లిం పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# యాస అంజిరెడ్డిని పరామర్శించిన జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి



క్రైమ్ మిర్రర్ వలిగొండ:యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని మొగిలిపాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు యాస అంజిరెడ్డి మాతృమూర్తి మరణించగా వారి కుటుంబాన్ని గురువారం జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి పరామర్శి ంచారు.ఈ సందర్భంగా ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేసి అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్టిఓ యాస శేఖర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మామిడి సత్తిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు పబ్బు ఎల్లయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్యలను పరిష్కరించాలి

## ప్రభుత్వ విప్ ఐలయ్యకు వినతిపత్రం అందజేసిన తెలంగాణా జర్నలిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు షానూర్

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 12::** యాదాద్రి భువనగిరి జిల్లాలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల సమస్యలను పరిష్కరించి,ఆదుకోవాలని ప్రభుత్వ విప్,ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్యకు తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబా యాదగిరిగుట్ట పట్టణంలోని వారి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు విప్ ఐలయ్య మాట్లాడుతూ జర్నలిస్ట్ ల ఇండ్ల సమస్యలను ఖచ్చితంగా పరిష్కరించి,ఇందిరమ్మ గృహ పథకంలో ప్రాధాన్యత కల్పించి అన్ని విధాలుగా ఆదుకుంటారని అన్నారు.వారితోపాటు యాదగిరిగుట్ట టీజేఏ మండల అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.





# జగదీష్ కాలనీలో పగిలిన మిషన్ భగీరథ పైపులు.

## 8 నెలలుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు.

**భద్రాచలం మార్చి 12:** భద్రాచలం పట్టణంలోని జగదీష్ కాలనీలో గోదావరి నీటి సరఫరాకు సంబంధించిన మిషన్ భగీరథ పైపులైన్లు సుమారు ఎనిమిది నెలల క్రితం రోడ్డుకు రెండు వైపులా పగిలిపోయినా ఇప్పటివరకు మరమ్మత్తులు చేయలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు సంబంధిత అధికారులకు, మిషన్ భగీరథ సిబ్బందికి తెలియజేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని వారు తెలిపారు. పైపులైన్లు పగిలి ఉండటంతో నీరు వృథాగా లీక్ అవుతూ ఉండటమే కాకుండా కాలనీలో తాగునీటి సరఫరా కూడా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.అదేవిధంగా పైపులైన్ల సమీపంలో కరెంట్ స్తంభం ఉండటం వల్ల రోడ్డుపై వెళ్లే ట్రాక్టర్లు, కార్లు తరచూ ప్రమాదానికి గురయ్యే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా అడపాల వెంకటేశ్వరరావు ఇంటికి వెళ్లే రోడ్డులో ఈ సమస్య ఎక్కువగా ఉందని కాలనీవాసులు పేర్కొన్నారు.ఎండాకాలం ప్రారంభమైన నేపథ్యంలో తాగునీటి కొరత మరింత పెరిగిందని, వెంటనే పగిలిన పైపులైన్లను మరమ్మత్తు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని జగదీష్ కాలనీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.ఈ విషయంపై తక్షణ చర్యలు తీసుకోవాలని అఖిల భారత మానవ హక్కుల సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ శ్రీనివాసరావు కోరారు.

# ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం





**ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**

**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 12:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం తాళ్లగూడెం,బాహుపేట గ్రామాలలో నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా ఎంతో ఎదురుచూసినా ఇళ్ల కల నెరవేరలేదని,కానీ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి సొంత ఇంటి కలను నిజం చేసిందని ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ గతంలో పది సంవత్సరాల పాటు పేదలకు ఇళ్లు ఇవ్వడంలో విఫలమైన ప్రభుత్వం ఉండేదని, కానీ ఇప్పుడు ప్రజా ప్రభుత్వం వచ్చాక పేదోడి సొంత ఇంటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఆలేరు నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం ఆనందకర విషయమని తెలిపారు. పేదల అభివృద్ధి, సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

## అజ్జలాపురంలో బెల్ట్ షాపుపై దాడి.. మద్యం స్వాధీనం

మర్రిగూడ (క్రైమ్ మిర్రర్): మండల పరిధిలోని అజ్జలాపురం గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న, మద్యం బెల్ట్ షాపులపై మర్రిగూడ పోలీసులు దాడులు నిర్వహించారు. గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న, నమ్మదగిన సమాచారం మేరకు, గురువారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన అంజయ్య ఇంట్లో, నిల్వ ఉంచిన సుమారు 15 లీటర్ల మద్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నందుకు గాను అంజయ్యపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గ్రామంలో ఎవరైనా అక్రమంగా మద్యాన్ని బెల్ట్ షాపుల ద్వారా, నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కృష్ణారెడ్డి ఈ సందర్భంగా హెచ్చరించారు.



## ప్రజలు 108 సేవలు సద్వినియోగం చేసుకోవాలి

### అపర సంజీవని 108 ఆకస్మిక తనిఖీ



**మునుగోడు క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:** మునుగోడు అపర సంజీవని 108 నీ జిల్లా అధికారులు ఎస్ కే సలీం ప్రోగ్రాం మేనేజర్ ,ఎమర్జెన్సీ మేనేజ్మెంట్ ఎగ్జిక్యూటివ్ ప్రదీప్ , మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నర్మద గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు.. సిబ్బంది పనితీరు ఎమర్జెన్సీ పరికరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తపరిచారు.రానున్న వేసవికాలంలో ఉష్ణోగ్రత అత్యధికంగా ఉండడం వలన వడదెబ్బ మరియు అత్యవసర కేసులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలి అని సిబ్బందికి సూచించారు..వడదెబ్బ కేసులను తక్షణమే ప్రథమ చికిత్సగా శరీరం చల్లబరిచే ఐస్ బాక్స్ టవల్స్ ఓఆర్ఎస్ అందుబాటులో ఉన్నాయన్నారు. 108 అంబులెన్స్ లో మెడికల్ అత్యాధునిక పరికరాలు మానిటర్, ఏ ఈ డి,అంబు బ్యాగ్,ఆక్సిజన్, స్ట్రక్చర్,స్కూప్ స్ట్రక్చర్,స్పైన్ బోర్డ్, సెక్షన్ ఆపరేటర్ మొదలగున్నవి ఉన్నాయి అన్నారు. ప్రతి నెల దాదాపుగా 120 కేసులు ఆర్టిఏ, స్ట్రోక్, చెస్ట్ పెయిన్ ,పెరాలసిస్, పాయిజన్ ,హ్యాంగింగ్ ,డెలివరీ, స్నేక్ బైట్ మరియు అన్కాన్షియస్ తదితర కేసులు చేస్తుంది అని వివరించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నర్మద కు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా 108 అంబులెన్స్ ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 108 సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ గుంటి రమేష్, నల్లగంటి వరప్రసాద్ ,పైలట్ ఎండి గాలిబ్ ఎస్కే మునీర్ పాల్గొన్నారు.

# వెలుగుమట్ల బాధితులకు జాగృతి అండ

**కవిత దీక్షకు మల్లోజు శ్రీనివాస చారి సంఘీభావం.**



**ఇబ్రహీంపట్నం(క్రైమ్ మిర్రర్):** ఖమ్మం జిల్లా కేంద్రంలోని వెలుగుమట్ల భూదాన్ భూ బాధితుల పక్షాన, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేపట్టిన నిరాహార దీక్షకు మద్దతు పెరుగుతోంది. స్థానిక అంబేద్కర్ భవన్ వద్ద కొనసాగుతున్న ఈ పోరాటానికి రంగారెడ్డి జిల్లా, యాచారం మండలం, మాల్ గ్రామానికి చెందిన నాయకులు మల్లోజు శ్రీనివాస చారి సోమవారం సంఘీభావం ప్రకటించారు. ?

**అర్ధరాత్రి వేళ బాధితుల రోదన**

ప్రభుత్వ చర్యల కారణంగా వెలుగుమట్లలో సుమారు 600 ఇళ్లు బుల్డోజర్ల ధాటికి నేలమట్టమయ్యాయని, ఫలితంగా దాదాపు 2 వేల మంది నిరుపేదలు ఒక్క రాత్రిలోనే వీధిన పడ్డారని శ్రీనివాస చారి ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుల్లో అత్యధికులు సమాజంలోని అణగారిన, బలహీన వర్గాలకు చెందిన వారే ఉన్నారని, వారిని ఈ విధంగా నిరాశ్రయులను చేయడం అమానుషమని ఆయన పేర్కొన్నారు. డీఎస్పీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ తో కలిసి, కల్వకుంట్ల కవిత ఈ దీక్షను ప్రారంభించిన సంగతి తెలిసిందే. బాధితులకు న్యాయం జరిగే వరకు, వారికి పునరావాసం కల్పించే వరకు ఈ పోరాటం ఆగదని, ఈ సందర్భంగా నాయకులు స్పష్టం చేశారు. సుమారు 2,000 మంది నిరాశ్రయులు, 600 గృహాల కూల్చివేత మనసులను కలిచి వేస్తుంది. నిర్వాసితులకు తక్షణ న్యాయం, శాశ్వత నివాసం ఏర్పాటు చెయ్యాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ?ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి అజయ్, నాయకులు కోరె సాయిరాం, రవి కుమార్, పుల్లయ్య తదితరులు పాల్గొని తమ మద్దతును తెలిపారు.

# టీపీసీసీ ఎస్సీ విభాగం చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కవ్వంపల్లి సత్యనారాయణ



**శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ నాయకుడు గొల్ల జాన్**

**కూకట్ పల్లి, మార్చి 12 (క్రైమ్ మిర్రర్) :** మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యులు డా. కవ్వంపల్లి సత్యనారాయణ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా పదవి స్వీకారం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ యు ఐ నాయకుడు గొల్ల జాన్ మాట్లాడుతూ చదువులో రాజకీయాల్లో రాణించి అకుంఠిత దీక్షతో ఈ స్థాయికి వచ్చారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల అభ్యున్నతికి విద్యే ప్రధాన మార్గం, అందరూ విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలని, దేశంలో నెహ్రూ నుంచి రాహుల్ గాంధీ వరకు కాంగ్రెస్ పార్టీ మాత్రమే సామాజిక న్యాయాన్ని పాటిస్తూ, దేశ ఐక్యత కోసం నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధులుగా టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు, దళిత ఎమ్మెల్యేలు, మాజీ ఎస్సి విభాగం అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం అన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమని విజయవంతం చేశారు.




## భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీ బస్సులను నడపాలి : ఈడీ సాల్మన్

**భద్రాద్రి కొత్తగూడెం మార్చి 12 :** శ్రీ రామనవమి సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బస్సులను సమర్థవంతంగా నడపాలని టీఎస్ఆర్టీసీ కరీంనగర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాల్మన్ సూచించారు. గురువారం భద్రాచలం ఐటిడిఏ మీటింగ్ హాల్‌లో భద్రాచలం డిపోకు సంబంధించిన శ్రీ రామనవమి ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలానికి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అదనపు బస్సులు ఏర్పాటు చేసి, ప్రయాణికులకు సౌకర్యవంతమైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు.సమావేశానికి ముందు ఈడీ సాల్మన్ భద్రాచలం బస్టాండ్‌ను అలాగే ఏపీఎస్ఆర్టీసీ బస్సుల పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన జూనియర్ కాలేజీ గ్రౌండ్‌ను పరిశీలించారు. ఈ సమావేశంలో ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ మల్లయ్య, వీ ఒ ఎస్ ఓ రవీందర్, ఎలక్ట్రిసిటీ ఈఈతో పాటు ఖమ్మం డి ఎం శివరామకృష్ణ, కొత్తగూడెం డి ఎం రాజ్యలక్ష్మి, భద్రాచలం బీ జంగయ్య, మణుగూరు శ్యాంసుందర్, మధిర రామయ్య, సత్తుపల్లి లక్ష్మీనారాయణ ఆరు డిపోల డిపో మేనేజర్లు పాల్గొన్నారు. అలాగే ఏపీఎస్ఆర్టీసీకి చెందిన గోకవరం, విజయవాడ, రాజమండ్రి డిపోల మేనేజర్లు కూడా హాజరయ్యారు.

## తాళ్లగూడెంలో నూతన కరెంట్ సబ్‌స్టేషన్ ప్రారంభించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**క్రైమ్ మిర్రర్, ఆత్మకూరు(ఎం) మార్చి 12:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం తాళ్లగూడెం గ్రామంలో రైతులకు మెరుగైన విద్యుత్ సౌకర్యం అందించేందుకు నిర్మించిన నూతన కరెంట్ సబ్‌స్టేషన్‌ను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ప్రారంభించారు.ఈ సబ్‌స్టేషన్ ప్రారంభంతో తాళ్లగూడెం, బహుపేట, మాసాయిపేట , ధర్మారెడ్డిగూడెం సహా సుమారు 15కు పైగా గ్రామాల రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి రానుంది.దీని వల్ల రైతులు వ్యవసాయ బావులు,మోటార్లు సులభంగా నడుపుకుని సాగు పనులు సకాలంలో నిర్వహించుకునే అవకాశం కలుగుతుంది.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని,రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు,స్థానిక నాయకులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## రావెళ్ళ కృష్ణారావు--మాలతి దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు

**మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు ఆశీస్సులు**




**కోదాడ మార్చి 12 ( క్రైమ్ మిర్రర్ ):** కోదాడ పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు రావెళ్ళ కృష్ణారావు, మాలతి దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు గోపి రెడ్డి నగర్ లోని రావెళ్ల కృష్ణ రావు నివాసం లో గురువారం ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా దంపతులు కోదాడ మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎర్నేని కుసుమ వెంకట్ రత్నం బాబు మాట్లాడుతూ రావెళ్ళ కృష్ణారావు, మాలతి దంపతులు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. వారి కుటుంబ జీవితం ఆనందంగా కొనసాగాలని ఆశీర్వదించారు. కాగా ఈ సందర్భంగా హుజూర్నగర్ వాస్తవ్యులు తాళ్లూరి నరసింహారావు ధర్మపత్ని సరిత, భాస్కర్ రావు రంగాచారి పలువురు రాజకీయ నాయకులు, మిత్రులు,బంధువులు ,దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజా ప్రతినిధులు జిల్లాను అభివృద్ధిలో ముందుంచాలి

–యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి,

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్





**యాదాద్రి భువనగిరి జిల్లా, మార్చి 12, క్రైమ్ మిర్రర్ :** ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన చేసుకుని అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు గ్రామాలలో, వార్డులలో అందించి జిల్లాను అభివృద్ధిలో ముందు ఉంచాల్సిన బాధ్యత సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, చైర్ పర్సన్ లపై ఉందని .... ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా భువనగిరి పట్టణంలోని వి-కన్వెన్షన్, న్యూ వివేరా లో నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు, సర్పంచులకు, చైర్ పర్సన్ లకు ఒకరోజు అవగాహన శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ముందుగా రాష్ట్ర గేయం వందేమాతరం గీతాన్ని ఆలపించారు.

**ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చూడాలి : ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య**

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య మాట్లాడుతూ... ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు కొనసాగుతుందని , సర్పంచులు, వార్డు మెంబర్లు, చైర్ పర్సన్ లు గ్రామాలలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి పేదవారికి అమలు చేసేలా చూడాలన్నారు. గత రెండు సంవత్సరాల వ్యవధిలో రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు ,200 యూనిట్లు ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డుల జారీ, సన్న బియ్యం సరఫరా వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రజాపాలన ప్రజా ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకొని గ్రామాలను అందంగా తీర్చిదిద్దే విధంగా పనులు చేపట్టాలన్నారు. అవసరమైన నీరును ఆలేరు నియోజకవర్గంలో అన్ని చెరువులు నింపడం జరిగిందన్నారు. రాబోవు కాలంలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది కాబట్టి గ్రామాలలో, పట్టణాలలో నీటి ఎద్దటి లేకుండా సమస్యలు పరిష్కరించాలన్నారు.

**ప్రజా ప్రతినిధులు గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలి :ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న**

ఎమ్మెల్సీ చింతపండు నవీన్ మాట్లాడుతూ... ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యశరణ ప్రణాళికను నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు సర్పంచులు అవగాహన కలిగి గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని, ఐదు సంవత్సరాల పాలనకు మంచి సహకారం ప్రజలకు అందించాలన్నారు. ప్రజలు మెచ్చేలా అభివృద్ధి పనులు గ్రామాలలో, పట్టణాలలో చేపట్టాలున్నారు. ప్రభుత్వ పథకాలను అవగాహన చేసుకుని వాటిని ఏ విధంగా సద్వినియోగం చేసుకోవాలో తెలుసుకొని గ్రామాలు అభివృద్ధి పథంలో ఉంచాలన్నారు.

**ప్రజలు మెచ్చినట్లుగా సేవలు అందించాలి : ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి**

భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. సర్పంచులు వార్డు మెంబర్లు ప్రజలకు ఏ సమస్య ఉందో తెలుసుకుని వారికి అవసరమైన సాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాలు ,ఇతర అభివృద్ధి పనులను గ్రామాలలో చేపట్టాలన్నారు. ప్రభుత్వం నుండి నిధులు మంజూరు అవుతున్నందున 5 ఏళ్ల పాలన సజావుగా నిర్వహించి ప్రజలకు మెచ్చి నచ్చి నట్టుగా సేవలు అందించాలన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల అవగాహన కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పనులు అర్హులైన ప్రతి పేదవారికి అందించే బాధ్యత గ్రామ సర్పంచులు, వార్డు మెంబర్లు, చైర్ పర్సన్ లదేనని అన్నారు. సాగునీటికి అన్ని చెరువులను నింపుకున్నామని ఎక్కడైనా సమస్య ఉంటే అక్కడికి వెళ్లి సమస్యలు పరిష్కరించాలని ఏ సమస్య ఉన్న పరిష్కరించే బాధ్యత నాదని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ మాట్లాడుతూ... గ్రామాలలో పారిశుధ్యం, పరిశుభ్రత పాటించినట్లయితే గ్రామాలు చాలా అందంగా తీర్చిదిద్దబడతాయని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రణాళికలో భాగంగా 10 ప్రధాన అంశాలను గ్రామాలలో, వార్డులలో సమస్యలు తీర్చి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ లో ఉన్న ఫైల్స్ క్లియర్ చేయడం జరుగుతుందన్నారు. నీటి ఎద్దడి లేకుండా ఎండలు దృష్టిలో పెట్టుకొని ముందస్తు ప్రణాళికలు వేసుకొని మీ మీ గ్రామాలలో సమస్యలు పరిష్కరించాలన్నారు. గ్రామ సర్పంచులు, కౌన్సిలర్లు ప్రజలకు అన్ని సదుపాయాలను గ్రామాలలో, పట్టణాలలో అభివృద్ధి పనులు చేపట్టి స్వయం సభివృద్ధి సాధించే విధంగా కృషి చేయాలన్నారు.

**తరతరాలు గుర్తుండేలా అభివృద్ధి జరగాలి : దివ్య దేవరాజన్**

సెర్ప్ సి.ఈ. ఓ, పంచాయతీ రాజ్ కమీషనర్ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ.. ప్రతి మండలంలో ప్రజా పాలన వచ్చినప్పటినుండి ఎన్నో అభివృద్ధిలు చేపట్టామన్నారు. తరతరాలుగా గుర్తుండే విధముగా అభివృద్ధి పనులు చేయాలన్నారు. కొత్తగా ఎన్నికైన వారికి ఒక స్పూర్తిని ఇవ్వడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని పట్టుదలతో అభివృద్ధి పనులు చేపడితే ఎలా అయినా విజయం సాధించవచ్చన్నారు. దానికి సంబంధించిన ప్రణాళికలు వేసుకోవాలని, గ్రామాలలో వార్డులలో కానీ గెలుపొందిన వారు మార్పు తీసుకురావాలన్నారు. ప్రభుత్వం నుండి 15వ ఫైనాన్స్ కమిషన్ ఫండ్ కూడా ప్రభుత్వం మంజూరు చేయడం జరిగిందని, అట్టి నిధులు గ్రామాలలో, కానీ పట్టణాల్లో కానీ దీనికి ఉపయోగిస్తే ప్రజలకు ఉపయోగపడుతుందని ప్రణాళిక వేసుకొని నిధులు వృధా చేయకుండా వినూత్న కార్యక్రమాలు చేపట్టాలన్నారు. గ్రామాలలో నూతన అంగన్వాడీ, తదితర అవసరమైన భవనాల ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. పచ్చదనం స్వచ్ఛందనంగా గ్రామాలు తీర్చిదిద్ది, శానిటేషన్ విధులు నిర్వహించే సిబ్బంది మంచిగా పని చేస్తే గ్రామం మంచిగా తీర్చిదిద్దుతారని అన్నారు. గ్రామాలు,పట్టణాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

**శిక్షణ కార్యక్రమాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ..,99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం గురించి అవసరమైన అవగాహన అందించేందుకు నూతన వార్డు సర్పంచులు, వార్డ్ మెంబర్లు, చైర్ పర్సన్ లు లకు ఏర్పాటు చేసిన ఈ శిక్షణ కార్యక్రమం ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామాలను , పట్టణాలను అందంగా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రభుత్వ పథకాల అమలు తీరు, లబ్దిదారుల ఎంపిక, ప్రభుత్వ పని తీరు లో వచ్చిన మార్పుల గురించి తెలుసుకోవాలన్నారు.ప్రతి శాఖ సంబంధించి పని తీరు ప్రజా ప్రతినిధులకు శిక్షణ కార్యక్రమంలో తెలుస్తుందని, ప్రజా ప్రతినిధులకు ఉన్న సందేహాలను నివృత్తి చేసుకోవాలని అన్నారు.

**ఎదుగుతున్న పిల్లలకు విధిగా అవగాహన కల్పించాలి: జిల్లా ఎస్పీ**

యాదాద్రి జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ లో భాగంగా జిల్లాలో ప్రమాద నివారణకు, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, గ్రామాలలో పట్టణాలలో రాష్ డ్రైవింగ్, వేరే హెల్మెట్,నో డ్రగ్స్ తదితర అంశాల గురించి ప్రజలకు ,ముఖ్యంగా ఎదుగుతున్న పిల్లలకు విధిగా అవగాహన కల్పించాలన్నారు. ప్రణాళికలోని 10 ప్రధాన అంశాలను జిల్లా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు, జడ్పీ సీఈవో శోభారాణి, జిల్లాలోని అన్ని మండలాల చైర్మన్లు, వార్డు మెంబర్లు, సర్పంచులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



## వివిధ వివాహ కార్యక్రమాలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్

**క్రైమ్ మిర్రర్,ఆత్మకూరు(ఎం) మార్చి 12:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలంలో కుమ్మరాజుల శ్రీను కూతురు, తుర్కపల్లి మండలంలోని బిఆర్ఎస్ కార్యకర్త ఉదయ రెడ్డి - లికిత రెడ్డి,చంద్రశేఖర్ నాయక్- పావని మరియు శివ నాగేందర్- మౌనిక వివాహ మహోత్సవంలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

## గోస్పెల్ గ్లోబల్ మినిస్ట్రీస్ 35వ వార్షికోత్సవం...నూతన సంవత్సర వేడుకలు




**కూకట్ పల్లి, మార్చి 12 (క్రైమ్ మిర్రర్) :** గోస్పెల్ గ్లోబల్ మినిస్ట్రీస్ వారి 36వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని, అలాగే తెలంగాణ ప్రభుత్వం మైనార్టీ సంక్షేమానికి అందిస్తున్న సహకారంతో గురువారం క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షల సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం బిషప్ ఆర్ ఏ పాల్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా కూకట్ పల్లి ఇన్‌చార్జ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే క్రిస్టియన్ అసోసియేషన్ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరై క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలను పరస్పరం పంచుకున్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, సభ్యులు సమాజంలో ఐక్యత, శాంతి, సోదరభావం పెంపొందించేందుకు ఇలాంటి సమావేశాలు ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం లో గాలి బాలాజీ, పుష్ప రెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, గంధం రాజు, దినేష్ కుమార్, శివ చౌదరి, సుజాత, వాణి, శైలజ, శ్రీకాంత్ పటేల్, పులి శివ గౌడ్, నాయుడు, మదన్ మోహన్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## కలుషిత త్రాగునీటి సమస్యలను పరిష్కరించాలి

కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గడ సభ్యులు నీరుడు శేఖర్‌ముదిరాజ్



గండిపేట(క్రైం మిర్రర్): కలుషిత త్రాగునీటి సమస్యలను పరిష్కరించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గడ సభ్యులు నీరుడు శేఖర్‌ముదిరాజ్ కోరారు. కిస్మత్‌పూర్ 122 డివిజన్ పరిధిలోని దర్గాఖలీజ్‌ఖాన్ ప్రాంతంలో ప్రజలకు సరఫరా అవుతున్న త్రాగునీరు కలుషితంగా వస్తుండడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మసస్యపై స్థానికులతో కలిసి జలమండలి డివిజన్ మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశామన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు శుద్ధమైన త్రాగునీరు అందేలా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. అలాగే ఈ సమస్యను అధికారులు త్వరితగతిన పరిష్కరించాలని, లేకపోతే స్థానిక ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, దర్గాఖలీజ్‌ఖాన్ ప్రాంత వాసులు ఉన్నారు.

## పీజీ, పీహెచ్‌డి విద్యార్థులకు స్టైఫెండ్ పెంచాలని అమరణ నిరాహార దీక్ష




**గండిపేట(క్రైం మిర్రర్):** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు తమ స్టైపెండ్ పెంపును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆమరణ నిరాహార దీక్షకు దిగారు. ఒక సంవత్సరం నుంచి ధర్నాలు, నిరసనలు, వినతిపత్రాల ద్వారా తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నాలు చేసినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి పరిష్కారం లభించలేదని వారు తెలిపారు. యూనివర్సిటీ పరిపాలన ఇప్పటికే పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల స్టైపెండ్ పెంపును ఆమోదించి అమలు చేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వ అనుమతి లేకపోవడంతో అది ఇంకా అమల్లోకి రాలేదని చెప్పారు. దీంతో తీవ్ర నిరాశకు గురైన పరిశోధక విద్యార్థులు తమ న్యాయమైన డిమాండ్ పూర్తిగా నెరవేర్చే వరకు ఆమరణ నిరాహార దీక్ష కొనసాగిస్తామని హెచ్చరించారు. విద్యార్థుల ఆమరణ నిరాహార దీక్షకు ఇతర విద్యార్థులు, పలు సంఘాలు మద్దతు ప్రకటిస్తున్నాయి. కేవలం స్టైపెండ్ పెంపు మాత్రమే కాక, యూనివర్సిటీ అభివృద్ధి కోసం రాష్ట్రానికి వెన్నెముకగా నిలుస్తున్న వెదురుగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి ప్రత్యేకంగా 500 కోట్లు బడ్జెట్ కేటాయించాలని కూడా డిమాండ్ చేస్తున్నారు. విద్య, పరిశోధనలలో నాణ్యత పెంచి తెలంగాణ వ్యవసాయ రంగంలో కీలక మలుపులు తేవాలనే లక్ష్యంతో ఇది కోరుతున్నారు. డిమాండ్ నెరవేర్చే వరకు మా దీక్ష కొనసాగుతుంది నిరాహార దీక్షలో యూనివర్సిటీ స్కాలర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్, కార్యదర్శి మనోజ్ కుమార్ గౌడ్, లోకేష్ ముదిరాజ్, వర్కింగ్ కమిటీ సభ్యులు మౌనిక మరియు సౌజన్యా నలుగురు పాల్గొని కూర్చున్నారు.




## నేటి నుంచి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం

రాజేంద్రనగర్ మండల పరిధిలో పరీక్షలు రాయనున్న 5080 మంది విద్యార్థులు

మొత్తం 22 కేంద్రాల్లో పరీక్షలు



**గండిపేట(క్రైం మిర్రర్):** పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టడం జరిగిందని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్ తెలిపారు. రాజేంద్రనగర్ మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చ్ 14వ తేదీ నుంచి వచ్చే ఏప్రిల్ 16వ తేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. మండలంలో మొత్తం 5080 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హజరుకానున్నారన్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 924, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు 4156 మంది పరీక్షల నిర్వాహణ కోసం మండంలో మొత్తంం 22 పరీక్షా కేంంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి కేంద్రంలో ఒక చీఫ్‌సూపరిండెంటెంట్ , ఒక డిపార్టమెంటల్ ఆఫీసర్‌లను నియమించామన్నారు. అదనంగా మొత్తం 264 మంది ఇన్విజిలేటర్లు పరీక్షల నిర్వహణలో విధులు నిర్వహించనున్నారన్నారు. పరీక్షలు ప్రతి రోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు జరుగుతాయన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు కనీసం అరగంట ముందు చేరుకోవాలన్నారు. విద్యార్థులు పరీక్షలకు అవసరమైన హాల్ టికెట్ తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. అలాగే పరీక్షా కేంద్రాలకు మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావడం నిషేధించబడిందన్నారు. తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు విద్యార్థులు సమయానికి పరీక్షలకు హాజరవడానికి సహకరించాలని కోరారు.

# రభి ధాన్యం కొనుగోలు సజావుగా సాగేలా చూడాలి

## ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలి... యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



**యాదాద్రి జిల్లా, మార్చి12, క్రైమ్ మిర్రర్ :** జిల్లాలో రబిలో సుమారు 4.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా ఉందని,రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ సాఫీగా జరిగేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. గురువారం మినీ మీటింగ్ హల్ లో సివిల్ సప్లై మేనేజర్, సివిల్ సప్లై అధికారులు, అగ్రికల్చర్,కో -ఆపరేటివ్, మెప్మా అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో నాలుగు లక్షల యాభై వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రానుందని అన్నారు.జిల్లాలో 330 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కేంద్రాల్లో గన్ని బ్యాగులు, టార్పాలిన్లు, మాయిచ్చర్ మిషన్లు, ప్యాడి క్లీనర్, తూకం పరికరాల వంటి అన్ని సదుపాయాలు ముందుగానే సిద్ధంగా ఉంచాలన్నారు. గన్ని బ్యాగుల కొరత, రవాణా సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, మిల్లులకు ధాన్యం తరలించిన వెంటనే దిగుమతి చేసుకునేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.వేసవికాలం నేపథ్యంలో కొనుగోలు కేంద్రాల్లో త్రాగునీరు,టెంట్లు, కుండల్లో చల్లటి మంచినీరు, నీడ ఏర్పాట్లు తప్పనిసరిగా చేయాలన్నారు.ప్రతి రోజు కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం వివరాలను ట్రక్ షీట్ లో నమోదు చేసి రికార్డులు నిర్వహించాలని ఆదేశించారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా కొనుగోలు నిర్వహించాలని ఆయన అధికారులకు సూచించారు. తదుపరి ఖరీఫ్ 2025-26 సీఎంఆర్ బియ్యం డెలివరీ పూర్తి చేయాలని పౌరసరఫరాల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి,సివిల్ సప్లై డిఎం హరికృష్ణ, సివిల్ సప్లై రోజారాణి , వ్యవసాయ అధికారి రమణారెడ్డి, ట్రాన్స్పోర్ట్ అధికారి సాయి కృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# భార్యను వేధించిన భర్తకు రెండేళ్ల జైలు శిక్ష..నల్గొండ కోర్టు తీర్పు

**నల్గొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** భార్యను వేధింపులకు గురిచేసిన కేసులో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడికి, రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ నల్గొండ ప్రత్యేక జెఎఫ్‌సీఎం (ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ నేరాలు) కోర్టు, గురువారం కీలక తీర్పు వెలువరించింది. ఈ వివరాలను జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ మీడియాకు వెల్లడించారు. వరంగల్ జిల్లా కొండకండ్ల మండలం, రామవరం గ్రామానికి చెందిన గిరగాని వేణు (43) ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తు న్నాడు. తన భార్యను అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడనే ఫిర్యాదుతో, 2015లో నల్గొండ మహిళా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి దర్యాప్తు అధికారులు పక్కా ఆధారాలతో, కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు.?విచారణ అనంతరం నిందితుడు వేణుపై, మోపబడిన నేరాలు రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్షలు ఖరారు చేశారు.



**సెక్షన్ 498 ఏ ఐపీసీ కింద, ఒక సంవత్సరం జైలు శిక్ష,**

- వరకట్న నిషేధ చట్టం సెక్షన్ 4 కింద, మరో ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు, 5వేల రూపాయల జరిమాన విధించారు. ?జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా, ఒక నెల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని కోర్టు పేర్కొంది. ?అయితే ఈ రెండు శిక్షలు ఏకకాలంలో అమలవుతాయని కోర్టు స్పష్టం చేసింది. కాగా ఈ కేసులో ఉన్న ఇతర నిందితులను ఏ2 నుండి ఏ5 వరకు కోర్టు నిర్దోషులుగా విడుదల చేసింది. కుటుంబ హింస, వరకట్న వేధింపులు చట్టప్రకారం తీవ్రమైన నేరాలు. మహిళలపై వేధింపులకు పాల్పడితే ఎంతటి వారైనా, చట్టం ముందు దోషులుగా నిలబడక తప్పదని ఎస్పీ పవార్ అన్నారు.
- ఈ కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన, ఏపీపీఓ ఎస్. మాధురి, అప్పటి దర్యాప్తు అధికారి సీఐ పి. సురేఖ, ప్రస్తుత ఎస్‌హెచ్ఓ కర్ణాకర్, సీడీఓ రమేష్ బాబు, కోర్టు లైజనింగ్ ఆఫీసర్లు నరేందర్, మల్లికార్జునలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.
- బాధితులు ఎవరైనా వేధింపులకు గురవుతుంటే భయపడకుండా డయల్-100 లేదా మహిళా పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించాలని, ఈ సందర్భంగా ఎస్పీ పవార్ సూచించారు.

## రంగారెడ్డిజిల్లాస్థాయి క్రీడాపోటీల్లో సత్తాచాటిన శివరాంపల్లి జెడ్‌పిహెచ్‌ఎస్ స్కూల్ విద్యార్థులు



**గండిపేట(క్రైం మిర్రర్):** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్ అన్నారు. రంగారెడ్డి జిల్లాస్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ అథ్లెటిక్స్ పోటీలు సరూర్‌నగర్‌లో నిర్వహిం చారు. జిల్లాస్థాయిలో శివరాంపల్లి పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభకనబరిచి బహుమతులు సాధించారు. కబడ్డీ బాలికలు మొదటి బహుమతి, కబడ్డీ బాలురు మొదటి బహుమతి, బాలుర విభాగంలో ఖోఖోలో ద్వితీయ బహుమతి సాధదించారు. ఈ సందర్భంగా గెలుపొందిన జట్లను ఆయన అభినందించారు. జిల్లాస్థాయిలో పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. కబడ్డీ బాలుర విభాగంలో పి.లక్ష్మణ్, సాయికుమార్, జశ్వంత్, అరుణ్ , కబడ్డి బాలికల విభాగంలో సభ అన్సారీస్, కీర్తన, వాలీబాల్ బాలురు చేతన్, సిద్ధి వినాయక, ఖోఖో బాలురు విభాగంలో రిషి, సూరజ్‌లు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు భూక్య శ్రీనునాయక్, అభివృద్ధి కమిటీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జ్ కె.గాంగ్యనాయక్, పీడీ జ్యోతిలు విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.సుదర్శన్, సరళమ్మ, వెంకటయ్య, నర్సింహ్మాచాంరి, జనార్ధన్‌చారి, స్టాఫ్ సెక్రటరీ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ క్రీడా పాఠశాలల్లో 4వ తరగతి ప్రవేశాలకు ఎంపికలు

గండిపేట(క్రైం మిర్రర్): రాజేంద్రనగర్ మండల క్రీడా పాఠశాల ప్రవేశాలకు దేహదారుఢ్య పరీక్షలు ఈ నెల 14వ తేదీన నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి శంకర్‌రాథోడ్, జోనల్ ఇంచార్జీ కె.గాంగ్యనాయక్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు శివరాంపల్లి జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం 3వ తరగతి చదువుతూ ఉండాలని, విద్యార్థి జననం 1--9--2017 నుంచి 31--8--2018 మధ్యలో ఉండాలన్నారు. ఆధార్ కార్డు, జనన ధృవీకరణ పత్రం, మూడవ తరగతి ప్రొగ్రెస్ రిపోర్ట్, ఐదు పాస్ ఫోటోలు తీసుకురావాలన్నారు. 30 మీటర్ల స్ప్రింట్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, షటిల్ రన్, వర్టికల్ జంప్, ఫ్లెక్సీ బులిటీ టెస్ట, 1.కేజీ మెడిసిన్ బాల్ త్రో, 800 మీటర్ల పరుగు, ఎత్తు, బరువు ఉంటాయన్నారు. ఆన్‌లైన్‌లో అప్లై చేసుకున్న వాళ్లు మాత్రమే అర్హులని తెలిపారు.

## రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

### మణికొండ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ



**గండిపేట(క్రైం మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య, ఇతర కార్మికుల సమస్యల ను వెంటనే పరిష్కరించాలని మణికొండ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ అన్నారు. జీహెచ్ఎంసీలో విలీనమైన మున్సిపాలి టీలలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు, ఇతర సిబ్బందికి జీతాల చెల్లింపులో ఆలస్యం వల్ల పడుతున్న ఇబ్బందులపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖకు విన్నవించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నగరానికి పరిశుభ్రతను మెరుగుపర చడం, పారిశుధ్య నిర్వాహణను బలోపేతం చేయడం లక్ష్యంగా 99 డేస్ గార్బేజ్ ఫ్రీ ప్రొగ్రామ్‌ను ప్రకటించిందన్నారు. నగరానికి పరిశుభ్రంగా ఉంచడం అనేది అత్యంత అసరమైన లక్ష్యమే అయినప్పటికి, విలీనం చేసిన మున్సిపాలిటీలలో ఉన్న వాస్తవ పరిస్థితి ఈ కార్యక్రమం ఇందుకు విరుద్ధంగా ఉందన్నారు. నార్సింగి సర్కిల్ పరిధిలో దాదాపు 400 మంది ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులు, ఇతర మున్సిపల్ సిబ్బంది ప్రతి నెల సుమారు 20--25 రోజుల పాటు జీతాల చెల్లింపులో ఆలస్యం కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వీరిలో చాలా మంది ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందినవారు కావడంతో వారి జీవనాధారం పూర్తిగా ఈ జీతాలపై ఆధారపడి ఉంటుందన్నారు. జీతాలు వారాల తరబడి ఆలస్యం కావడం వల్ల వారి కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో పడుతున్నాయన్నారు. అత్యవసర ప్రాధాన్యంతో పరిష్కరించడం ద్వారా వందలాధి మంది కార్మికులకు ఉపశమనం కలిగించడమే కాకుండా పారిశుధ్య కార్యక్రమాలు సమర్ధవంతంగా అమలవడానికి కూడా దోహదపడతాయన్నారు.

## శివరాంపల్లి వద్ద 400 గ్రాముల గంజాయి స్వాధీనం

గండిపేట(క్రైం మిర్రర్):శివరాంపల్లి నేషనల్ పోలీస్ అకాడమీ ముందు ఈ రోజు ఉదయం గంజాయి విక్రయిస్తున్న తరుణ్ శర్మను టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తరుణ్ శర్మ నుంచి 400 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తరుణ్ శర్మను మైలార్ దేవ్ పల్లి పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





## ఆశాల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడాలని కూకట్ పల్లి ఎమ్మెల్యేకి వినతి

**కూకట్ పల్లి, మార్చి 12 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం లోని ఆశాల తరఫున కూకట్ పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆశలకు ఫిక్స్ వేతనం అందించేందుకు అసెంబ్లీలో మాట్లాడాలని ఆశాలు, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందించారు. అనంతరం సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ఐలపురం రాజశేఖర్ మాట్లాడుతూ ఆశాలకు ఫిక్స్ వేతనం రూ.18000 ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆశాలకు హామీ ఇచ్చింది, హామీని నెరవేర్చాలని, ఆశలకు గ్రాడ్యుటీ రిటర్మెంట్ బెనిఫిట్ లు అవకాశాలు కల్పించాలని క్యాజువల్, మెడికల్ లీవ్లను మంజూరు చేయాలని ఆశల సమస్య పై కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అసెంబ్లీ సమావేశాలలో మాట్లాడాలని విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆశ యూనియన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు డి అనిత, భాషమ్మ, సబియా, వినోద, సంతోష్ బాయ్, రాజేశ్వరి, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులకు ఇండియన్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్‌లో ఘన విజయం

### విద్యార్థిని, విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు కీర్తినివ్వాలి

### కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**కూకట్ పల్లి, మార్చి 12 (క్రైమ్ మిర్రర్) :** శ్రీ చైతన్య స్కూల్, ఎస్‌పి నగర్ డి.ఎస్. బ్రాంచ్‌కు చెందిన విద్యార్థులు ఇండియన్ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ పరీక్షలో విశేష ప్రతిభ కనబరిచారు.ఈ పరీక్షలో అమల్ కిరణ్ సాహూ గ్రాండ్ ప్రైజ్‌గా ల్యాప్‌టాప్‌ను గెలుచుకోగా, భావికా, వరుణ్ మొదటి బహుమతిగా ట్యాబ్ లను సాధించారు.ఈ సందర్భంగా విద్యార్థులు స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ని మర్యాదపూర్వకంగా కలుసుకుని, ఆయన చేతుల మీదుగా బహుమతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఎమ్మెల్యే విద్యార్థులను ఆశీర్వదిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. తమ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు కీర్తి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం శివరామకృష్ణ, ఆర్ఐ పద్మజా, కోఆర్డినేటర్ మురళీకృష్ణ, ప్రిన్సిపల్ సుభాషిణి, డీన్ హరికృష్ణ, ఇన్‌చార్జ్ అరవింద్, శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి విక్రేతల అరెస్టు



**గండిపేట(క్రైం మిర్రర్):** గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను పట్టుకోని అత్తాపూర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వరరావు, ఎసై ?స జయరాజు తెలిపిన వివరాల ప్రకారం అకోలాసిటీ మహారాష్ట్రకు చెందిన షేక్ షోయబ్(22) ట్రక్ డ్రై వర్‌గా పని చేస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ నదీమ్(19) డేంటింగ్‌తో పాటు పెయింటింగ్ పనులు చేస్తుంటాడు. మహారాష్ట్ర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసిన గంజాయిని పి.వి.నర్సింహ్మరావు ఎక్స్‌ప్రెస్‌వే ఎలివేటెడ్ వే పిల్లర్ నెంబర్ 254 వద్ద గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎసై ?స జయరాజ్ సిబ్బందితో కలిసి గంజాయి విక్రయించేందుకు అక్కడ ఉన్న ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు 1.743 గ్రాముల ఎండు గంజాయితో పాటు 25 వేల విలువ కలిగిన రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

# హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతానికి సమగ్ర మొబిలిటీ ప్రణాళిక పై వర్క్‌షాప్





**హైదరాబాద్, మార్చి 12(క్రైమ్ మిర్రర్):** హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతం(హెచ్ఎంఏ) కోసం సమగ్ర మొబిలిటీ ప్రణాళిక(సిఎంపి)పై వర్క్‌షాప్‌ను హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ(హెచ్ఎండిఏ)ను గురువారం హైదరబాద్‌లోని హోటల్ తాజ్ వివాంటా వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమం హెచ్ఎండిఏ మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ మార్గదర్శకత్వంలో జరిగింది. ఈ వర్క్‌షాప్‌కు పలు ఉన్నతాధికారులు అధ్యక్షత వహించారు. వీరిలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(ఎంఏఅండ్‌యూడి) జయేష్‌రంజన్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(ఆర్అండ్‌బి) వికాస్‌రాజ్, రవాణా కమిషనర్ కె.ఇలంబరిథి, టీజీఐఐసీ వైస్ చైర్మన్ అండ్ ఎండి, ఎఫ్‌సీడీఏ కమిషనర్ కె.శశాంక, పట్టణ రవాణా అంశాలపై ప్రభుత్వ సలహాదారు ఎన్.వి.ఎస్.రెడ్డి, ఐఆర్ఏఎస్ డైరెక్టర్, డిటిసిపి ఎస్.దేవేందర్‌రెడ్డి, జేఎన్‌టియూ కాకినాడ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె.ప్రసాద్‌లు పాల్గొన్నారు. ఆర్థిక అభివృద్ధి ప్రణాళిక, సమగ్ర మొబిలిటీ ప్రణాళిక, 2050 వరకు మౌలిక సదుపాయాల ప్రణాళిక కోసం బ్లూ, గ్రీన్ మాస్టర్ ప్లాన్‌లు సీపీఐ అధ్యయాన్ని ఎం/ఎస్ ఎల్ఈఏ అసోసియేట్స్ సౌత్ ఏసియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహిస్తుంది. ఈ వర్క్‌షాప్ ముఖ్య ఉద్దేశ ప్రాథమిక సిఫార్సులను ప్రదర్శించి, ప్రధాన భాగస్వాముల నుంచి అభిప్రాయాలను సేకరించడం. ప్రభుత్వ సలహాదారు ఎన్.వి.ఎస్. రెడ్డి ట్రాన్సిట్ ఫస్ట్ విధానాన్ని ప్రాముఖ్యంగా సూచిస్తూ, ప్రజా రవాణా వ్యవస్థ బలోపేతం, మెట్రో రైల్‌కు లాస్ట్ మైల్ కనెక్టివిటీ మెరుగుదల, మెట్రో ఫేజ్–II విస్తరణ, పార్కింగ్ సమస్యల పరిష్కారం, తక్షణ మెరుగుదల ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ హైదరాబాద్‌లో గతంలో నిర్వహించిన ట్రాఫిక్ అధ్యయనాలను గుర్తుచేస్తూ హెచ్ఎండిఏ పర్యాయ ప్రణాళికా ప్రయత్నాలను ప్రశంసించారు. అలాగే ను వికసిత్ భారత్ 2047 లక్ష్యాలతో అనుసంధానం చేసి,



దాని పరిధిని వరకు విస్తరించాలని సూచించారు. జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) డి. జోయెల్ డేవిస్నగర కేంద్ర ప్రాంతాలు , సైబరాబాద్‌లో ట్రాఫిక్ , పార్కింగ్ సమస్యలను ప్రస్తావిస్తూ పార్కింగ్ మేనేజ్‌మెంట్ ప్రణాళికలు, బేగంబజార్‌కు లాజిస్టిక్స్ పరిష్కారాలు, ట్రాఫిక్ రద్దీ తగ్గించే వ్యూహాలను సూచించారు. రవాణా కమిషనర్ కె. ఇలంబరిథి వ్యక్తిగత వాహనాల వేగవంతమైన పెరుగుదలపై ఆందోళన వ్యక్తం చేస్తూ ప్రజా రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరచాల్సిన అవసరాన్ని తెలియజేశారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ మెట్రో, వ్యవస్థలను బలోపేతం చేయడం, అలాగే హైదరాబాద్‌ను బెంగళూరు , అమరావతి--చెన్నై నగరాలతో కలిపే హై స్పీడ్ రైలు కారిడార్ల అభివృద్ధిని ప్రస్తావించారు. ఎం/ఎస్ ఎల్ఈఏ అసోసియేట్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డా. ఎం.పి. రాజు వివరించారు. 2030, 2040, 2050 సంవత్సరాల దృష్ట్యా అదనపు మెట్రో నెట్‌వర్క్ పొడవు వరుసగా 258.4 కి.మీ., 534.1 కి.మీ., మరియు మొత్తం కలిపి 556.6 కి.మీ.గా ప్రతిపాదించారు. ప్రతి దిశకు ఒక ట్రాక్ ఉండే ట్విన్ ట్రాక్ వ్యవస్థను పరిగణలోకి తీసుకున్నారు. 2030, 2040 నాటికి అదనపు నెట్‌వర్క్ 202 కి.మీ., 255.6 కి.మీ.గా ఉండి, 2050 నాటికి మొత్తం 336.4 కి.మీ. వరకు విస్తరించనుంది. 2030, 2040, 2050 సంవత్సరాలకు అనుగుణంగా కొత్త రోడ్లు, హైవేలు, ఆర్టీరియల్, సబ్ ఆర్టీరియల్ కారిడార్లు (18 మీటర్ల కంటే ఎక్కువ వెడల్పు ఉన్నవి), కలెక్టర్ రోడ్లను ప్రతిపాదించారు. వీటి మొత్తం పొడవు వరుసగా 223 కి.మీ., 2,640 కి.మీ., 2,847 కి.మీ. ఉంటుంది. లేన్-కి.మీ.ల పరంగా చూస్తే రోడ్ నెట్‌వర్క్ 2030లో 759 లేన్-కి.మీ., 2040లో 11,070 లేన్-కి.మీ., 2050లో 19,352 లేన్-కి.మీ.గా పెరుగుతుంది. 2050 వరకు 75 గ్రేడ్ సెపరేటర్లు ప్రతిపాదించారు. 120 ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు/స్కైవాక్‌లు ప్రతిపాదించారు. 34 =ాదీలు, 16 లు ప్రతిపాదించారు. 8 ఎలివేటెడ్ రోడ్లు ప్రతిపాదించారు. ముసి నదిపై 29 వంతెనలు నిర్మించేందుకు ప్రతిపాదించారు.



## పల్లెర్ల యాదయ్యకు ఘన నివాళి

**క్రైమ్ మిర్రర్ వలిగొండ:** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు పల్లెర్ల రామచందర్ తండ్రి పల్లెర్ల యాదయ్య మృతి చెందడం జరిగింది.ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ హాజరై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ వారి పార్థివ దేహంపై పూల మాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొనడం జరిగింది.ఈ కార్యక్రమంలో పొద్దుటూరు సర్పంచ్ దుబ్బ దానయ్య సందెల శ్రీనివాస్ పల్లెర్ల సుధాకర్ దేవేందర్ బోయ లింగస్వామి కందుల అంజయ్య కోట ఉపేందర్ భాస్కర్ శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ ప్రవేశాలకు విద్యార్థులు హాజరు కావాలి

### మండల విద్యాధికారి ఈ గురువారావు



**చౌటుప్పల్, మార్చి12, క్రైమ్ మిర్రర్:** నాలుగో తరగతి స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు నేడు శుక్రవారం ఉదయం 9:30 కు చౌటుప్పల్ మున్సిపల్ పరిధి తంగడపల్లి గ్రామంలోని జడ్.పి.హెచ్.ఎస్ నందు సంబంధిత సర్టిఫికెట్స్ తో దరఖాస్తు చేసుకున్న వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులతో హాజరు కావాలని మండల విద్యాధికారి ఈ గురువారావు గురువారం పత్రికకు ఇచ్చిన ఓ ప్రకటన ద్వారా కోరారు. విద్యార్థులు స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## లిఫ్ట్ కాలువను ప్రారంభించిన ఆకుల ఇంద్రసేనారెడ్డి




**చౌటుప్పల్, మార్చి 12, క్రైమ్ మిర్రర్ :** మునుగోడు శాసన సభ్యులు కోమటి రెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ఆదేశానుసారం దివిస్ పరిశ్రమ సౌజన్యంతో పిల్లయపల్లి కాలువ నుండి పైపు లైను వేసి లిఫ్ట్ ద్వారా లోద్ది కుంట, గంగదేవి కుంటలను నీటి తో నింపే పనులను కాలువ కమిటీ అధ్యక్షులు,చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్ర సేన రెడ్డి చేతుల మీదుగా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలువ సాధన కమిటీ నుండి రైతులందరమూ కలిసి మునుగోడు శాసన సభ్యులను కలిసిన వెంటనే ఎమ్మెల్యే స్థానిక దివిస్ పరిశ్రమ యాజమాన్యం తో మాట్లాడి వారి సిఎస్ఆర్ నిధుల తో లిఫ్ట్ మంజూరు చేయించి ఈ ప్రాంత రైతుల బీడు భూములను సాగు భూములుగా మార్చే భాగ్యం కల్పించిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి లక్కారం గ్రామ రైతుల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఆకుల ఇంద్రసేనారెడ్డి తెలియ జేశారు. అలాగే ఎమ్మెల్యే ఒక్కమాట చెప్పగానే వెంటనే స్పందించి కమ్యూనిటీ సోషల్ రెస్పాన్స్ కింద ఒక కోటి ఆరు లక్షల నిధులను లిఫ్ట్ స్కీమ్ కు మంజూరు చేసిన దివిస్ పరిశ్రమకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో దివిస్ పరిశ్రమ సిఎస్ఆర్ విభాగం ప్రతినిధి గోపి ,స్థానిక 08 వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ బద్రి గాలయ్య, మాజీ ఎంపీటీసీ కాసార్ల శ్రీనివాస్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కొయ్యడ సైదులు గౌడ్, గ్రామ పెద్దలు దుబ్బాక శ్రీనివాస్ రెడ్డి, గుండె బోయిన నర్సింహా యాదవ్, సూరకంటి మధుసూదన్ రెడ్డి, ఆకుల తిరుమల్ రెడ్డి, మునుకుంట్ల మల్లేశం గౌడ్, రాసాల ఐలయ్య, మునుకుంట్ల యాదయ్య గౌడ్, గంటిల యాదయ్య, తోటకూర రాములు యాదవ్, గోపన బోయిన పెద్ద పెంటయ్య, తోటకూర జంగయ్య, సూరకంటి రాఘవ రెడ్డి, పాశం రాజేష్,ఆకుల యాదిరెడ్డి, రాసాల రవి పాల్గొన్నారు.

## ప్రజల ప్రాణాలను పారా ఫ్యాట్ ( గడ్డి మందు) ను నిషేధించాలని ఖమ్మం శ్రీరక్ష హాస్పిటల్ అధినేత డా. జి .వి

### ఖమ్మంలో పారా క్యాట్ నిషేధించాలి అని ట్యాంక్ బండ్ పై రాలి






**క్రైమ్ మిర్రర్ ఖమ్మం ప్రతినిధి :** ఖమ్మంలో శ్రీ రక్షా హాస్పిటల్ అధినేత డాక్టర్ జి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు హరిస్తున్న పారా క్యాట్ గడ్డి మందు నిషేధించాలని ఈ గడ్డి మందును పూర్తిగా ప్రభుత్వం నిషేధించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు డాక్టర్ జీవి మాట్లాడుతూ పారా క్యాట్ దీనివలన ప్రజల ప్రాణాలు చాలా ప్రమాదంలో పడే ప్రమాదం ఉంది అని అన్నారు మనము అనుకుంటాము కానీ ఆ గడ్డి మందు మన ఇంటికి దగ్గరికి రాదు అని అనుకుంటాము కానీ ఆ గడ్డి మందు పంట లకు కొట్టినప్పుడు అది ఆ పంటలో చేరి మన ఇంటిలోకి ప్రవేశిస్తుంది దానిని స్వీకరించిన మనకు థైరాయిడ్ క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు సంక్రమిస్తాయి ఇంట్లో ఏదైనా గొడవ జరిగినప్పుడు ఇంట్లో ఉన్న గడ్డిమందు సేవించడం జరిగినప్పుడు దానికి విరుగుడు ఉండదు ఏ ఇతర మందు తాగిన విరుగుడు ఉంటుందో గానీ ఈ గడ్డి మందుకు విరుగుడు అనేది ఉండదు ఈ గడ్డి మందు ని 60 దేశాలు పూర్తిగా బ్యాన్ చేసిన నాయి యూరోపియన్ కంట్రీస్ మొత్తం గడ్డి మందును బ్యాన్ చేసినాయి యూరోపియన్ కంట్రీస్ తయారు చేసిన గడ్డి మందును మనము ఉపయోగించి మన ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నాము ఈ గడ్డి మందు ని బ్యాన్ చేయడం వలన మనకు ఎలాంటి ఇబ్బంది ఉండదు . ఏదైనా కొంచెం పంట తగ్గుతుందేమో కానీ ఆరోగ్యం చాలా బాగుంటుంది ఈ గడ్డి మందులు మన దేశంలో పూర్తిగా బ్యాన్ చేయాలని ప్రభుత్వంతో చర్చించుచున్నాము సేంద్రియ వ్యవసాయంతో చాలా ఉపయోగాలు ఉన్నాయని తెలిపినారు ఈ కార్యక్రమంలో డాక్టర్ జి వెంకటేశ్వర్లు డాక్టర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## సహారా కార్యాలయం ముందు బాధితుల ధర్నా

### డిపాజిట్ డబ్బులు చెల్లించాలని డిమాండ్

**మంచిర్యాల మార్చి 12: (క్రైమ్ మిర్రర్) :** సహారా ఇండియా సంస్థలో పెట్టిన డిపాజిట్లను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ బాధితులు గురువారం నస్పూర్‌లోని సీసీసీ ఎక్స్ రోడ్ వద్ద ఉన్న సహారా ఇండియా కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తూ సంస్థ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు.సింగరేణి విశ్రాంత ఉద్యోగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, కూలీలు, చిన్న వ్యాపారులు తమ కష్టార్జిత డబ్బులను సహారా సంస్థలో ఫిక్స్‌డ్ డిపాజిట్లుగా పెట్టినట్లు తెలిపారు. పాలసీలు మెచ్యూరిటీ పూర్తై




సంవత్సరాలు గడిచినా డబ్బులు చెల్లించకుండా కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారని ఆరోపించారు.10--15 రోజుల్లో డిపాజిట్ చేసిన మొత్తాలు చెల్లించకపోతే బెల్లంపల్లి, మందమర్రి, మంచిర్యాల, నస్పూర్ ప్రాంతాల్లోని సహారా కార్యాలయాల ముందు రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.




Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.